www.toliadugudaily.com
www.epaper.toliadugudaily.com

# తొలిఅడుగు

తెలుగు దిన పత్రిక

## ప్రభుత్వ పాఠశాలల్ని బలోపేతం చేద్దాం..



3

హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 236 ఆదివారం 26- 01 - 2025 ఎడిటర్ : పి. జయరాం పేజీలు : 8 వెల : 4

## ఉత్తమ సేవలు అందించిన పోలీసులకు కేంద్రం అవార్డులు




తొలిఅడుగు, హైదరాబాద్ : ఉత్తమ సేవలు అందించిన పోలీసు అధికారులకు కేంద్రం పతకాలు ప్రకటించింది. రిపబ్లిక్ డే సందర్భంగా పతకాలు కేంద్ర ప్రభుత్వం అవార్డులు అందించనున్నది. హైదరాబాద్ లా అండ్ ఆర్డర్ అదనపు సీవీ విక్రమ్‌సింగ్, ఎస్పీ మాణిక్యరాజ్‌కు ప్రెసిడెంట్ మెడల్స్‌ను కేంద్రం ప్రకటించింది. మరో 12 మందికి విశిష్ట సేవా పతకాలు ప్రకటించింది. ఐజీ కార్తికేయ, ఎస్పీలు ముత్యంరెడ్డి, రామ్‌కుమార్, ఫజ్లుర్, డీఎస్పీలు వెంకటరమణ, వేణుగోపాల్, ఏఎస్‌ఐలు రణ్‌వీర్‌సింగ్, ఠాకూర్, జోసెఫ్, మొయినుల్లాఖాన్, సీఐ నిరంజన్‌రెడ్డి, కానిస్టేబుల్ పాత్యనాయక్, ఆయూబ్‌కు విశిష్ట సేవా పతకాలకు ఎంపిక చేసింది. ముగ్గురు అగ్నిమాపక అధికారులు, నలుగురు హొంగార్డులకు సైతం పతకాలకు ఎంపికయ్యారు.

## దావోస్ పర్యటనపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు..



తొలిఅడుగు, హైదరాబాద్ : దావోస్ పర్యటన ముగించుకుని అమరావతికి వచ్చిన ఏపీ సీఎం చంద్రబాబు.. ఇవాళ రాష్ట్ర సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పర్యటన అంశాలు, పెట్టుబడుల వివరాలను చంద్రబాబు వివరించారు. ఈ క్రమంలోనే ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. అవేంటంటే.. 'దావోస్ అంటే అందరికి ఒక భ్రమ ఉంది. ఎన్ని ఎంవోయూలు చేశారు..?

2

## మహా కుంభమేళాలో మరోసారి అగ్నిప్రమాదం..



తొలిఅడుగు : ప్రయాగ్‌రాజ్‌లోని మహాకుంభమేళా ప్రాంతంలో మరోసారి అగ్నిప్రమాదం సంభవించింది. పార్కింగ్‌లో ఉన్న వాహనాల్లో మంటలు చెలరేగాయి. దీంతో కుంభమేళా ప్రాంతంలో కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది.

2


## రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయి రెడ్డి రాజీనామా



తొలిఅడుగు అమరావతి : ఏపీలో వైసీపీ అధికారం కోల్పోయిన నాటి నుంచి ఆ పార్టీకి చెందిన ముఖ్య వ్యక్తులు రాజీనామా బాట పట్టారు. జగన్‌కు అత్యంత నమ్మకస్తుల్లో ఒకరైన వైసీపీ సీనియర్ నాయకులు, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని స్పీకర్ ఫార్మట్‌లో రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కడ్ కు శనివారం అందజేశారు. నిన్న సాయంత్రం తాను పొలిటిక్స్ నుంచి శాశ్వతంగా తప్పుకుంటున్నట్లుగా ట్విట్టర్ (ఎక్స్) ద్వారా

2

## అన్నదాతల ఆత్మహత్యలకు ఏం సమాధానం చెబుతారు..?



తొలిఅడుగు, హైదరాబాద్ : రాష్ట్రంలో అన్నదాతల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. శనివారం ఉదయం ఆదిలాబాద్ జిల్లాలోని బజార్‌హత్నూర్ మండలం వర్తమన్నూర్‌కు చెందిన మామిళ్ల నర్సయ్య పొలంలో ఉరేసుకున్నాడు. ఈ ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పందించారు. రైతు మామిళ్ళ నర్సయ్య అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర విచారకరం అని హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే గడిచిన వారం రోజుల్లో నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరం. రైతుల మరణ మృదంగం జరుగుతుంటే రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం ఏం చేస్తున్నట్లు? కాంగ్రెస్ పాలనలో రైతన్నకు భరోసా లేక మనోధైర్యం కోల్పోతున్నడు. అందరికి అన్నం పెట్టే అన్నదాతకు సున్నం పెడుతున్నది కాంగ్రెస్ పార్టీ అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. నమ్మి ఓటేసిన పాపానికి నట్టేట ముంచి, నమ్మక ద్రోహం చేస్తున్నది. రుణమాఫీ పూర్తి చేసినట్లు రంకెలేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. అప్పులు తీర్చలేక బలవన్మరణాలకు పాల్పడుతున్న రైతులకు ఏమని సమాధానం చెబుతారు అని హరీశ్‌రావు నిలదీశారు. రైతుల ఆత్మహత్యలకు కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ఆ రైతు కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నాం. ఆత్మహత్యలు పరిష్కారం కావు, బతికుండి కొట్లాడుదాం. అధైర్య పడొద్దు, బీఆర్ఎస్ పార్టీ మీకు అండగా ఉంటుందని పిలుపునిస్తున్నా అని హరీశ్‌రావు పేర్కొన్నారు.


## ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ కోత..



తొలిఅడుగు, చండీగఢ్: ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్లు ఒక రోగికి సర్జరీ చేస్తున్నారు. అయితే విద్యుత్ కోత కారణంగా ఆపరేషన్ థియేటర్‌లోని ఎమర్జెన్సీ లైట్లు ఆగిపోయాయి. దీంతో ఆ రోగికి శస్త్రచికిత్సను డాక్టర్లు నిలిపివేశారు. కరెంట్ తిరిగి వచ్చే వరకు వైద్యులు వేచి

2

## కేజ్రీవాల్‌పై మండిపడ్డ అమిత్ షా



తొలిఅడుగు, న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ , ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్ పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా న్యూఢిల్లీలో జరిగిన ఓ సభలో అమిత్ షా మాట్లాడారు. కేజ్రీవాల్ గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని

2

## తెలంగాణ సంస్కృతి,

# కళలు, వారసత్వ సంపద


– తెలంగాణ రాష్ట్ర సుస్థిర అభివృద్ధికి సోపానాలు




తొలిఅడుగు, హైదరాబాద్ : 13వ శతాబ్దంలో రుద్రమదేవి దార్శనిక నాయకత్వం నుండి ఉద్భవించిన తెలంగాణ వారసత్వం చరిత్రలో మహోన్నతంగా నిలిచింది. భారతదేశ చరిత్రలో రుద్రమ దేవి అత్యంత విశిష్ట మహిళా పాలకులలో ఒకరిగా పేరు ప్రఖ్యాతలు పొందింది. రుద్రమ దేవి క్రీ.శ.1262-1289 మధ్య కాలంలో పరిపాలించింది. ఎన్నో అవరోధాలను అధిగమించి పరిపాలనలో శ్రేష్ఠతకు ఆమె పునాది వేసింది. కాకతీయ గొప్ప సాంస్కృతిక వారసత్వం క్రీ.శ.1213 లో నిర్మించిన అద్భుతమైన కట్టడం రామప్ప దేవాలయం.. తెలంగాణలోని రామప్ప ను %ఖచీజుూజూ% ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తించింది. ఈ ఆలయం అద్భుత శిల్పాలను కలిగిఉంది. ఈ ఆలయంలో వినూత్నమైన నీటిపై తేలియాడే ఇటుకలు, ప్రత్యేకమైన శాండ్‌బాక్స్ ఫౌండేషన్ టెక్నాలజీ, అద్భుత వాస్తు నిర్మాణ నైపుణ్యం తదితర అంశాలు హైలెట్ గా నిలుస్తాయి.."రుద్రదేవ మహారాజు" పేరుతో రుద్రమదేవి, నేటి వరంగల్ గా పిలుస్తున్న ఓరుగల్లు నుండి కాకతీయ సామ్రాజ్యాన్ని అద్భుతంగా పరిపాలించింది. 27 సంవత్సరాలుగా యాదవ రాజ్యంపై పలు కీలక విజయాలను సాధించి, ప్రజలకు సుపరిపాలన అందించింది. సుపరిపాలనలో మహోన్నత వారసత్వ విలువలు కొనసాగించడం, సమన్యాయం పాటించడం తదితర అంశాలు తన పరిపాలనలో విప్లవాత్మక విధానంతో కూడిన అభివృద్ధికి దోహదపడ్డాయి. తెలంగాణ ఆధునిక అభివృద్ధికి రుద్రమ పాలనను స్ఫూర్తిగా తీసుకుంటూనే, పరిపూర్ణ సామరస్యంతో పరిపాలన అందిస్తోంది ప్రస్తుత ప్రజా ప్రభుత్వం. ఆనాటి పరిపాలన స్ఫూర్తితో నేటి పురోగతికి అమలు చేస్తున్న

2

## సివిల్ సర్వీసెస్ పరీక్షలకు కొత్త నిబంధన




తొలిఅడుగు, ఇటీవల ప్రకటించిన నిబంధనల ప్రకారం, యుపిఎస్‌సి సివిల్ సర్వీసెస్ ప్రిలిమనరీ పరీక్షలకు దరఖాస్తు చేసేటప్పుడు అభ్యర్థులు వయస్సు నిర్ధారణ, రిజర్వేషన్ సంబంధిత పత్రాలు సమర్పించడాన్ని కేంద్రం తప్పనిస

2

## మహా కుంభమేళాలో మరోసారి అగ్నిప్రమాదం..

మొదటిపేజీ తరువాయి కుంభమేళాకు వెళ్లే ప్రధాన రహదారిలోని సెక్టార్ 2 సమీపంలోని పార్కింగ్ ఏరియాలో శనివారం ఉదయం 6:30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తమ వాహనాలను ఇక్కడే పార్క్ చేస్తారని అగ్నిమాపక శాఖ అధికారి విశాల్ యాదవ్ తెలిపారు. ప్రస్తుతం అక్కడ విపరీతమైన వేడి కారణంగా మంటలు చెలరేగినట్లు చెప్పారు. సమాచారం అందుకున్న ఆరు అగ్నిమాపక యంత్రాలు ఘటనాస్థలికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో ఓ కారు పూర్తిగా దగ్ధమవగా.. మరో కారు పాక్షికంగా దెబ్బతిన్నట్లు వెల్లడించారు. ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, అందరూ సురక్షితంగా ఉన్నట్లు తెలిపారు. కాగా, ఈనెల 19వ తేదీన అంటే ఆదివారం కూడా మహా కుంభమేళాలో భారీ అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. ఎల్పీజీ సిలిండర్ పేలడంతో సెక్టార్ 19లో మంటలు చెలరేగి 18 గుడారాలు ఆహుతయ్యాయి. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. నల్లటి దట్టమైన పొగలు అలుముకోవడంతో అఖాడాల సమీపంలో భయాందోళన నెలకొంది. సాయంత్రం 4 గంటలకు మంటలు అంటుకోగా గంటలోపలే మంటలు అదుపులోకి వచ్చాయని అధికారులు తెలిపారు.

45 రోజులపాటు జరిగే మహా కుంభమేళా జనవరి 13న పౌష పూర్ణిమ నాడు ప్రారంభమైంది. ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రితో ముగుస్తుంది. ఇక కుంభమేళా ప్రారంభమైన ఈనెల 13వ తేదీ నుంచి 23వ తేదీ వరకూ 10.21 కోట్ల మంది భక్తులు ప్రయాగ్‌రాజ్‌ను సందర్శించి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు యూపీ సర్కార్ వెల్లడించింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరయ్యే భక్తుల సంఖ్య 50 కోట్లు దాటుతుందని యోగి ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో కోట్లాది మందికి తగిన రీతిలో ఏర్పాటు చేసింది యూపీ ప్రభుత్వం. సుమారు లక్షా 60 వేల టెంట్లను ఏర్పాటు చేశారు. లక్షా 50 వేల టెయిలెట్లను నిర్మించారు. దాదాపు 15వేల మంది శానిటేసన్ వర్కర్లు పనిచేయనున్నారు. 1250 కిలోమీటర్ల దూరం పైప్‌లైన్ వేశారు. 67 వేల ఎల్ఈడీ లైట్లు, రెండు వేల సోలార్ లైట్లు, మూడు లక్షల వృక్షాలను ఏర్పాటు చేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ కోత..

మొదటిపేజీ తరువాయి ఉన్నారు. దీని గురించి ఒక డాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పంజాబ్‌లోని పాటియాలాలో ఈ సంఘటన జరిగింది. ఇటీవల ప్రభుత్వ రాజేంద్ర ఆసుపత్రికి చెందిన వైద్యుల బృందం ఆపరేషన్ థియేటర్‌లో ఒక రోగికి ఆపరేషన్ చేశారు. అయితే ఉన్నట్టుండి కరెంట్ పోయింది. దీంతో ఆపరేషన్ థియేటర్‌లోని ఎమర్జెన్సీ లైట్లు ఆగిపోయాయి. విద్యుత్ పరికరాలు కూడా పనిచేయలేదు. ఈ నేపథ్యంలో డాక్టర్లు ఆ రోగికి ఆపరేషన్ నిలిపివేశారు. కరెంట్ రాకకోసం ఎదురుచూశారు. కాగా, ఆ రోగికి ఆపరేషన్ చేస్తున్న బృందంలోని ఒక వైద్యుడు ఆ ప్రభుత్వ ఆసుపత్రిలో నెలకొన్న ఈ దుస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితిలో ఆ రోగికి ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహించాలని ప్రశ్నించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో పంజాబ్‌లోని ఆప్ ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి.

మరోవైపు పంజాబ్ ఆరోగ్య మంత్రి బల్బీర్ సింగ్ ఈ సంఘటనపై స్పందించారు. ఆ ప్రభుత్వ ఆసుపత్రిలో విద్యుత్ బ్యాకప్ వ్యవస్థలు సక్రమంగా పని చేస్తున్నాయని తెలిపారు. విద్యుత్ పునరుద్ధరణ వెంటనే జరిగిందని చెప్పారు. అయితే ఆ డాక్టర్ భయపడి ఈ వీడియోను రికార్డ్ చేసినట్లు ఆయన ఆరోపించారు. ఆ రోగికి సర్జరీలో ఎలాంటి ఇబ్బంది ఎదురుకాలేదని అన్నారు. ఆసుపత్రి సిబ్బంది ఎల్లప్పుడూ రోగి సంరక్షణపై దృష్టిసారించాలని మంత్రి బల్బీర్ సింగ్ సూచించారు.

## కేజ్రీవాల్‌పై మండిపడ్డ అమిత్ షా

మొదటిపేజీ తరువాయి షా విమర్శించారు.

తాము అధికారంలోకి వస్తే యమునా నదిని ఏడేళ్లలో శుభ్రం చేస్తామని, యమునా నదిని లండన్‌లోని థేమ్స్ నదిలా మారుస్తానని, ఢిల్లీ ప్రజల ముందే తాను యమునా నదిలో మునకవేస్తానని గతంలో కేజ్రీవాల్ ఇచ్చిన హామీలను అమిత్ షా గుర్తుచేశారు. పదేళ్లు అధికారంలో ఉన్నా ఆ హామీ నెరవేరలేదని విమర్శించారు. కేజ్రీవాల్ యమునా నదిలో ఎప్పుడు మునక వేస్తాడా అని ఢిల్లీ ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఆయన కచ్చితంగా యమునలో ప్రపంచ ప్రఖ్యాతమైన మునక వేయాలని షా డిమాండ్ చేశారు. ఒకవేళ యమునా నదిలో మునక వేయలేకపోతే మహా కుంభమేళాకు వెళ్లి త్రివేణి సంగమంలో మునక వేయాలని, చేసిన పాపాలను కడిగేసుకోవాలని అమిత్ షా సూచించారు. ఢిల్లీలో వాయు కాలుష్యం కూడా విపరీతంగా పెరిగిపోయిందని, కాలుష్యాన్ని అరికట్టడంతో కేజ్రీవాల్ సర్కారు పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు కేవలం రెండు వారాల ముందు నగరంలోని ప్రధాన సమస్యలైన నీటి కాలుష్యం, వాయు కాలుష్యం గురించి అమిత్ షా మాట్లాడటం చర్చనీయాంశమైంది. కాగా, కేజ్రీవాల్ నోరు తెరిస్తే అబద్ధాలే మాట్లాడుతాడని అమిత్ షా విమర్శించారు. ఢిల్లీని క్లీన్ చేస్తానని చెప్పి చేయలేదని, యమునా నదిని శుభ్రం చేయిస్తానని చేయించలేదని ఆరోపించారు. అంతేగాక తనకు ముఖ్యమంత్రిగా తనకు ప్రభుత్వ బంగ్లా అక్కర్లేదని చెప్పాడని, కానీ ఆ హామీని కూడా విస్మరించి రూ.51 కోట్లతో 50 వేల చదరపు అడుగుల శీష్ మహల్ కట్టుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన రాజకీయ జీవితంలో కేజ్రీవాల్ అంత స్పష్టంగా అబద్ధాలు మాట్లాడే నాయకుడిని ఇంతవరకు చూడలేదని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి, అర్వింద్ కేజ్రీవాల్‌కు బుద్ధి చెప్పాలని, బీజేపీని గెలిపించాలని అమిత్ షా ఓటర్లను కోరారు.

# సివిల్ సర్వీసెస్ పరీక్షలకు కొత్త నిబంధన

మొదటిపేజీ తరువాయి ముందు అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్షకు అర్హత సాధించిన తరువాత అటువంటి పత్రాలను అప్‌లోడ్ చేస్తుండేవారు. ఐఎఎస్ మాజీ ప్రొబేషనర్ పూజా ఖేడ్కర్‌కు సంబంధించిన వివాదం నేపథ్యంలో కేంద్రం ఈ నిబంధన తీసుకువచ్చింది. ప్రభుత్వ ఉద్యోగంలో తన ఎంపికకోసం పూజా ఖేడ్కర్ వంచనకు పాల్పడిందని, ఒబిసి, దివ్యాంగుల కోటా ప్రయోజనాలను తప్పుగా పొందిందని ఆరోపణలు వచ్చిన విషయం విదితమే. అయితే, ఆమె ఆ ఆరోపణలు అన్నిటినీ ఖండించింది. ఐఎఎస్, ఐపిఎస్, ఐఎఫ్ఎస్ వంటి సర్వీసుల్లో అధికారుల ఎంపిక నిమిత్తం ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు దశల్లో సివిల్ సర్వీసెస్ పరీక్షలను యుపిఎస్‌సి ఏటా నిర్వహిస్తుంటుంది. 'సివిల్ సర్వీసెస్ పరీక్షకు దరఖాస్తు చేయాలని సంకల్పిస్తున్న అభ్యర్థి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి, ఆన్‌లైన్ దరఖాస్తు పత్రంతో పాటు కమిషన్ కోరే జనన తేదీ, కేటగరీ (ఎస్‌సి/ ఎస్‌టి/ ఒబిసి/ ఇడబ్లుఎస్/ పిడబ్లుబిడి/ మాజీ సైనికులు), విద్యార్హత, సర్వీస్ ప్రాథమ్యం మొదలైనవాటి క్లెయిముల దిశగా సమర్థన పత్రాలను సమర్పించాలి' అని బుధవారం (22) నాటి సివిల్ సర్వీసెస్ పరీక్ష నిబంధనావళి 2025 స్పష్టం చేసింది. పేరు నమోదు, ఆన్‌లైన్ దరఖాస్తుతో పాటు కావలసిన సమాచారం/ పత్రాలు సమర్పించకపోతే పరీక్షకు అభ్యర్థిత్వం రద్దు అవుతుందని ఆ ప్రకటన స్పష్టం చేసింది. 2025 సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షను మే 25న నిర్వహించనున్నట్లు యుపిఎస్‌సి ఒక ప్రకటనలో తెలియజేసింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తును ఫిబ్రవరి 11 సాయంత్రం 6 గంటల వరకు దాఖలు చేయవచ్చునని యుపిఎస్‌సి తన ప్రకటనలో సూచించింది.

# దావోస్ పర్యటనపై చంద్రబాబు కీలక వ్యాఖ్యలు..

మొదటిపేజీ తరువాయి ఎంత డబ్బులు వచ్చాయి..? ఇది ఒక భ్రమ. అంటే ఇన్ ది సెన్స్.. ఇక్కడ ఉండే ఎంవోయూలు అక్కడ పోయి చేసుకోవాల్సిన పని లేదు. దావోస్ ఈజ్ ప్లేస్ ఫర్ నెట్ వర్కింగ్' అని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎవరూ ఊహించని విధంగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని దృష్టిలో ఉంచుకునే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ వ్యంగ్యాస్త్రాలు సంధించి ఉంటారని రాజకీయ విశ్లేషకులు, నెటిజన్లు పేర్కొంటున్నారు. రేవంత్ పరిపాలనను హేళన చేసే విధంగా చంద్రబాబు సెటైర్లు వేశారని నెటిజన్లు గుసగుసలాడుకుంటున్నారు. ఎందుకంటే.. దావోస్ పర్యటనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఒప్పందం చేసుకున్న మూడు కంపెనీలూ హైదరాబాద్‌కు చెందినవే. మన రాష్ట్ర రాజధానిలో కొలువైన కంపెనీలే.. మన రాష్ట్రంలోనే పెట్టుబడులు పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నాయన్నమాట. అదీ స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో. ఆయా కంపెనీల ప్రధాన కార్యాయాల నుంచి ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న సచివాలయంలో చేసుకోవాల్సిన ఒప్పందాలు.. ఏడువేల కిలోమీటర్ల దూరంలో ఉన్న దావోస్‌లో ఎందుకు జరిగాయని సోషల్‌మీడియాలో ప్రశ్నలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే.

దావోస్ పర్యటనలో భారీగా పెట్టుబడులు సాధించినట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాపత్రయపడుతున్నారని విశ్లేషకులు అభిప్రాయపడిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌కే చెందిన కంపెనీలతో స్విట్జర్లాండ్‌లో ఎంవోయూలు చేసుకున్నారని విమర్శలు గుప్పించారు. వాస్తవానికి డబ్ల్యూఈఎఫ్ వేదికగా తెలంగాణలో ఉన్న అవకాశాలను దేశ, విదేశీ కంపెనీలకు పరిచయం చేసి, చర్చలు జరిపి, పెట్టుబడులు సాధించాల్సి ఉంటుంది. భారతదేశంలో పెట్టుబడులు పెట్టాలనుకునే విదేశీ కంపెనీలను తెలంగాణకు ఆకర్షించేలా ప్రజంటేషన్ ఇవ్వాలి. అలాంటిది హైదరాబాదీ కంపెనీలకు కొత్తగా తెలంగాణలో ఉన్న అవకాశాలను వివరించాల్సిన అవసరం ఏమున్నదని ప్రశ్నించారు. ఈ తతంగం మొత్తం ఇక్కడే పూర్తి చేయొచ్చని, కేవలం సొంత ప్రచారం కోసమే డబ్ల్యూఈఎఫ్‌ను వేదికగా చేసుకున్నారని ఆరోపించారు. మేఘా రూ.15వేల కోట్లు, కంట్రోల్ ఎస్ సంస్థ రూ.10 వేల కోట్లు, స్కైరూట్ రూ.500 కోట్లు.. మొత్తంగా మూడు కంపెనీలు కలిపి రూ.25,500 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే.

ఈ ఎంవోయూలను దృష్టిలో ఉంచుకునే ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించి ఉంటారని విశ్లేషకులు, ఐటీ ఉద్యోగులు, నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. మరి ఇంత ఘోరంగా పరువు తీసుకుంటారా..? అని రేవంత్ రెడ్డిపై మండిపడుతున్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం తమ పరిపాలనలో మార్పులు తెచ్చుకోవాలని సూచిస్తున్నారు. పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా మనపై సెటైర్లు వేయడమంటే.. రేవంత్ రెడ్డి పాలన ఏంటో తెలిసిపోతోందని.. ఇతర రాష్ట్రాల్లో తెలంగాణ నవ్వుల పాలవుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు రాష్ట్ర పౌరులు.

# రాజ్యసభ సభ్యత్వానికి విజయసాయి రెడ్డి రాజీనామా

మొదటిపేజీ తరువాయి ప్రకటించారు. ఇది ఏ పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని తెలిపారు. ఏ రాజకీయ పార్టీలోనూ చేరడం లేదని స్పష్టం చేశారు. వేరే పదవులు, ప్రయోజనాలు, డబ్బు ఆశించి రాజీనామా చేయడం లేదని తెలిపారు. రాజకీయాలకు గుడ్‌బై చెప్పే నిర్ణయం పూర్తిగా తన వ్యక్తిగతమని విజయసాయి రెడ్డి తెలిపారు.

తనపై ఎలాంటి ఒత్తిళ్లు లేవని.. తనను ఎవరూ ప్రభావితం చేయలేదని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాలుగా, మూడు తరాలుగా నన్ను నమ్మి ఆదరించిన వైఎస్ కుటుంబానికి రుణపడి ఉంటానని అన్నారు. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చిన జగన్‌కు, తనను ఇంతటి ఉన్నతస్థాయికి తీసుకెళ్లిన భారతమ్మకు సదా కృతజ్ఞుడిని అని తెలిపారు.

జగన్ కి మంచి జరగాలని కోరుకుంటున్నా అని ఆకాంక్షించారు. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా, రాజ్యసభలో ఫ్లోర్ లీడర్‌గా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పార్టీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా కృషి చేశానని విజయసాయి రెడ్డి తెలిపారు. కేంద్రానికి రాష్ట్రానికి మధ్య వారధిలా పనిచేశానని పేర్కొన్నారు. దాదాపు తొమ్మిది సంవత్సరాలు ప్రోత్సహించి కొండంత బలాన్ని, మనోధైర్యాన్నిచ్చి తెలుగురాష్ట్రాల్లో తనకు గుర్తింపునిచ్చిన ప్రధాని మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టీడీపీతో రాజకీయంగా విభేదించానని విజయసాయి రెడ్డి తెలిపారు. చంద్రబాబు కుటుంబంతో వ్యక్తిగతంగా విభేదాలు లేవని స్పష్టం చేశారు. పవన్ కళ్యాణ్‌తో చిరకాల స్నేహం ఉందని తెలిపారు. తన భవిష్యత్తు వ్యవసాయం చేసుకోవడమే అని అన్నారు. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఆదరించిన రాష్ట్ర ప్రజలకు, మిత్రులకు, సహచరులకు, పార్టీ కార్యకర్తలకు ప్రతి ఒక్కరికీ పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేశారు.

# తెలంగాణ సంస్కృతి, కళలు, వారసత్వ సంపద

మొదటిపేజీ తరువాయి పలు పథకాలే ఇందుకు తార్కాణం. ప్రాచీన వారసత్వ సంపద.. ఆధునిక నైపుణ్యత... కొత్త పునరుజ్జీవనానికి నాంది ..చారిత్రక వైభవం, సాంకేతిక నైపుణ్యత తెలంగాణ చరిత్రకు ఒక గొప్ప వరంగా సంభవించాయి. అత్యాధునిక ఆవిష్కరణలతో శతాబ్దాల సాంస్కృతిక శ్రేష్ఠతకు సజావుగా వారధిగా మార్చే పురోగమన ప్రయాణాన్ని తెలంగాణ వారసత్వ సంపదకు నిదర్శనంగా ఉన్నది. 13వ శతాబ్దపు మహిళా నాయకురాలు రుద్రమ దేవిలో స్ఫూర్తిదాయకమైన వారసత్వం ఉంది. ఆమె దార్శనిక నాయకత్వం, ఆమె మార్గదర్శక పాలన, తెలంగాణ సమకాలీన అభివృద్ధి విధానాన్ని స్ఫూర్తిగా కొనసాగిస్తున్నారు.. అన్ని వర్గాల ప్రజల ఆదరణ, ఆమె పరిపాలనలో కనిపించింది. వ్యూహాత్మక ప్రజ్ఞకు ఉదాహరణగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది.అధునాతన సాంకేతిక నైపుణ్య కేంద్రాలు వరంగల్ కోట వంటి ఐకానిక్ చారిత్రక స్మారక చిహ్నాల డిజిటల్ సంరక్షణ, సాంప్రదాయ హస్తకళను ఏకీకృతం చేయడం ద్వారా సాంకేతిక పురోగతికి తెలంగాణ నిలుస్తున్నది. ఆధునిక డిజైన్ టెక్నాలజీ, వారసత్వం, ఆవిష్కరణల మధ్య తెలంగాణ రాష్ట్రం చారిత్రక ప్రదేశాలలో ఇన్నోవేషన్ హబ్‌లను ఏర్పాటు చేసింది. ఇది ప్రగతిశీల విధానాలతో రుద్రమ దేవి యొక్క సాంప్రదాయ పాలనా సమ్మేళనానికి అద్దం పట్టే ఏకైక సంశ్లేషణను సృష్టించింది. టాటా టెక్నాలజీస్ లిమిటెడ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యంతో, తెలంగాణ 65 పారిశ్రామిక శిక్షణా సంస్థలను ఆధునీకరించడం ద్వారా నైపుణ్యాభివృద్ధిలో విప్లవాత్మక మార్పులు చేపట్టింది. ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీస్, ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, రోబోటిక్స్, ఆటోమేషన్, డిజిటల్ తయారీ, అధునాతన డిజైన్ లు, ఆవిష్కరణలు తదితర రంగాల్లో నిపుణతను పెంచుతున్నారు.

ఇవే కాకుండా తెలంగాణ రాష్ట్రం విభిన్న అందాలను ప్రదర్శించే సహజ, సాంస్కృతిక పర్యాటక ప్రదేశాలను గుర్తించింది. ప్రకృతి ప్రేమికులు,పర్యాటకులను ఆకర్షించే ప్రదేశాలు, ప్రశాంతమైన వాతావరణం ఉట్టిపడే శామీర్‌పేట్ జింకల పార్కును, బోగత జలపాతం , మంజిర వన్యప్రాణుల అభయారణ్యం,లక్నవరంసరస్సు తదితర ప్రదేశాలు గొప్ప జీవవైవిధ్యానికి సాక్ష్యం.

అద్భుతమైన ప్రకృతి దృశ్యాల ద్వారా మంత్రముగ్ధులను చేసే ప్రయాణాన్ని అందించడంతోపాటు సహజ సౌందర్యం, సాంస్కృతిక గొప్పతనాన్ని సంపూర్ణంగా సమ్మేళనంగా అందించే సుందరమైన నాగార్జున సాగర్ నుండి శ్రీశైలం క్రూయిజ్ వంటి ప్రత్యేక ప్యాకేజి టూర్లను రాష్ట్రం అందుబాటులోకి తెచ్చింది. వన్యప్రాణుల ప్రేమికుల కోసం కవ్వాల్ టైగర్ రిజర్వ్ లో థ్రిల్లింగ్ సఫారీలను ప్రారంభించారు. అద్భుతమైన బుద్ధవనంలో యాత్రికులు ఆధ్యాత్మిక సేదని పొందవచ్చు. భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలు రాష్ట్ర అభివృద్ధికి, సమగ్ర విధానాన్ని ప్రదర్శిస్తాయి:పర్యావరణ వ్యవస్థ, విస్తరణ, తెలంగాణ వ్యూహాత్మక నైపుణ్యాభివృద్ధికి ఉపాధి మార్గాలు

# ఓహెూ ఇండియా ఆధ్వర్యంలో సన్ రైజ్ హాస్పిటల్ హెల్త్ క్యాంప్

తొలిఅడుగు, చిన్నకోడూరు, జనవరి 25 : చిన్నకోడూర్ మండల పరిధి గోనెపల్లి గ్రామంలో ఓహెూ ఇండియా ఆధ్వర్యంలో సన్ రైజ్ హాస్పిటల్ హెల్త్ క్యాంప్ నిర్వహించినది. ఈ సందర్భంగా ఓహెూ ఇండియా జోనల్ మేనేజర్ మధు నాయక్ మాట్లాడుతూ జ్వరం. దగ్గు .దమ్ము. చాతి నొప్పి. ముక్కు వెంట నీరు తుమ్ములు. కరోనా. హస్తమా. టీబి. ఊపిరితిత్తుల నీరు.నీయోనియా వంటి వ్యాధులకు. చికిత్స చేయడం జరుగుతుందన్నారు .కావున హెల్త్ క్యాంపును ప్రజలందరూ సదినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ స్వరూప ఎల్ల గౌడ్, పంచాయతి కార్యదర్శి జ్యోతి ,ఓహెూ ఇండియా రీజినల్ మేనేజర్లు రామకృష్ణ, రాజు, సన్ రైజ్ హాస్పిటల్ డాక్టర్ ధనలక్ష్మి, ఓయ్ ఇండియా ప్రతినిధులు శిల్పరాజ్, శంకర్ నిఖిత ,రేష్మ ,రఘు ,డాక్టర్ బృందం తదితరులు పాల్గొన్నారు.



# ప్రతీ ఒక్కరికీ ఓటు హక్కు ఇచ్చిందే అంబేద్కర్...

**– బక్కి వెంకటయ్య( చైర్మన్, తెలంగాణ ఎస్సీ ఎస్టీ కమిషన్)**



తొలిఅడుగు, జనగామ, జనవరి 25 : ఓటర్ల దినోత్సవం సందర్భంగా జనగామ జిల్లా కేంద్రంలో వందేమాతరం స్టూడెంట్ ఫెడరేషన్ (వియస్ఎఫ్), జనగామ జిల్లా ఉద్యమకారుల ఆద్వర్యంలో మంగళంపల్లి రాజు అధ్యక్షతన జనగామ చౌరస్తాలో ఓటుహక్కుపై అవగాహన కార్యక్రమం చేపట్టగా ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి మాట్లాడుతూ ఈరోజు ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా భారత దేశం అభివృద్ధి చెందుతుందన్నా , దేశ ప్రజలందరూ కులమతాలకు అతీతంగా ఓటు వేస్తున్నారాన్న దానికి అంబేద్కర్ గారే కారణమని తెలిపారు. ఈ సందర్భగా ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ సంఘం జిల్లా ఇన్చార్జి తిప్పారపు విజయ్, పానుగంటి ప్రవీణ్ లు మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ ల పై జరుగుతున్న దాడులను సంబంధించి పోలీసులు కేసులు నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు సువార్త, వియస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నల్ల రాహుల్, వేంపటి అజయ్, సల్ల మహేష్(చింటు), యాదగిరి, నరేష్, తదితరులు ఉన్నారు.

# నిరుపేద కుటుంబాల వైద్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి కొండంత అండ.

**– కాంగ్రెస్ పార్టీ మానకొండూరు నియోజకవర్గం అధికార ప్రతినిధి పసుల వెంకటి.**

తొలి అడుగు, ఇల్లంతకుంట, జనవరి 25: రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం లోని పెద్దలింగాపూర్ గ్రామంలోని కొట్టేపెల్లి పరశురాములు కు 38000, సలంద్రీ వజ్రవ్వ కు 13000,బోల్గం రంగయ్య కు 16000 రూపాయల చెక్కులను కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ కరివేద స్వప్న కరుణాకర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీఅధ్యక్షులు కేతిరెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో సి ఏం ఆర్ ఎఫ్ చెక్కులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి, మానకొండూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు భూంపల్లి రాఘవరెడ్డి లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కుడుముంజ రవీందర్,బండారి రవీందర్, రామంచ లచ్చయ్య,గన్నారపు లచ్చయ్య, జంగిటి మోహన్, మాతిరెడ్డి నవీన్ రెడ్డి, పసుల లచ్చయ్య, పసుల పరశు



రాములు, ల్యాగల సంపత్,ఆనంద్, బొప్పసత్యం, పసుల నరసయ్య, పసల నరేష్, బండారి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్ని బలోపేతం చేద్దాం..

**– ధర్మారం మండల విద్యాధికారి పోతు ప్రభాకర్**



తొలిఅడుగు, ధర్మారం, జనవరి 25 : ధర్మారం మండలంలోని పత్తిపాక ప్రాథమిక పాఠశాలలో జరిగిన పేరెంట్ టీచర్ మీటింగ్ కి విచ్చేసిన ధర్మారం మండల విద్యాధికారి పోతు ప్రభాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం పత్తిపాక అన్ని మౌలిక వసతులతో బాటు నాణ్యమైన విద్యను, పౌష్టికాహారాన్ని, ఉచిత పాఠ్యపుస్తకాలను అందిస్తూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేస్తుందని కావున ప్రతీ ఒక్కరూ తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు గీసిన చిత్రాలను చూసి ప్రశంశించారు. ఈ సందర్భంగా నూతనంగా మండల విద్యాధికారిగా భాద్యతలు స్వికరించిన ప్రభాకర్ ను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు శాలువతో ఘనంగా సన్మానించుట జరిగింది. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కే.పి.నరేందర్ రావు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు నూతి మల్లయ్య, ఉపాధ్యాయులు శ్రీలత, శారద, సునిల్,కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్ ప్రేమ్ సాగర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ ఏలేటి పద్మ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# "వియస్ఎఫ్ రాజ్యాంగ ఉత్సవాల"లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతుల ప్రదానం..

తొలిఅడుగు, జనగామ, జనవరి 25 : 76వ గణతంత్ర దినోత్సవం జరుగుతున్న సందర్భంగా రాజ్యాంగంపై పెద్ద ఎత్తున అవగాహన కలిగించేలా వందేమాతరం స్టూడెంట్ ఫెడరేషన్ (వియస్ఎఫ్) జిల్లా అధ్యక్షుడు నల్ల రాహుల్ అధ్యక్షతన జనగామ జిల్లా కేంద్రంలో గల పాఠశాల, కలశాల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా, అందులో గెలుపొందిన సాన్ మారియా, సెయింట్ పాల్ , స్కాలర్స్ గ్రామర్ స్కూల్ విద్యార్థులకు యస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజు , వియస్ఎఫ్ వ్యవస్థాపకులు మంగళంపల్లి రాజు బహుమతులు అందజేశారు. రాజ్యాంగంపై అవగాహన కల్పించడానికి వియస్ఎఫ్ చేపట్టిన కార్యక్రమాలలో ఇది మొదటి అడుగు మాత్రమే అని, జనవరి 26 నుండి 14 ఏప్రిల్ వరకు "వియస్ఎఫ్ రాజ్యాంగ ఉత్సవాలు" నిర్వహిస్తామని మంగళంపల్లి రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో వియస్ఎఫ్ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్, జిల్లా నాయకులు బిట్ల చిన్న, కిరణ్, అరుణ్, లక్ష్మన్, ప్రవీణ్, అంజి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.







# మృతుని కుటుంబానికి దోకూరి ప్రభాకర్ రెడ్డి ఆర్థిక సహాయం

తొలిఅడుగు, కల్వకుర్తి, జనవరి 25 కల్వకుర్తి : తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామానికి చెందిన గుంత సింహయ్యమృతి చెందాడు.విషయం స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డొకురి ప్రభాకర్ రెడ్డిలిమృతుడి ఆత్మకు శాంతి జరగాలని భగవంతుని ప్రార్థిస్తూ స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా 3,000 -00 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మల్లె కేడి అంబాజీ, మాజీ ఉపసర్పంచ్, అజీజ్ , మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, ఎల్ మల్లేష్, పి విష్ణు, సిహెచ్ లక్ష్మణ్, ఎం .రమేష్, సిహెచ్ శివ, ఎరుకలి ఆంజనేయులు, బి జంగయ్య,ఆఫ్తాబ్, తదితరులు పాల్గొన్నారు.



# బీటీ రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కు వినతి

**– ఎమ్మెల్యే ను కలిసిన గిరిజన నాయకులు**

తొలిఅడుగు, అమనగల్, జనవరి 25 : అమనగల్లు మండలం శంకర్ కొండ తాండ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న దయ్యాల బోడు తాండకు కత్వా వాగు వంతెన నుంచి దయ్యాల బోడు తాండ వరకు సుమారు 500 మీటర్ల దూరం వరకు బీటీ రోడ్డు లేక గిరిజన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని హైదరాబాద్ లోని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో తాండ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. మా గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేసి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి దయ్యాల బోడు తాండకు బీటీ రోడ్డు మంజూరు చేస్తానని చెప్పి అక్కడే వున్న డిఈ కి బీటీ రోడ్డు విషయాన్ని తెలియజేసారు . ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ రాజు నాయక్ గ్రామ యూవజన నాయకులు శ్రీను నాయక్.నవీన్ నాయక్.రాజేష్ నాయక్.విజయ్ నాయక్, పాండు నాయక్ తదితరులు పాల్గొన్నారు.




# జాతీయ స్థాయి క్రీడాకారులకు అభినందనలు

తొలి అడుగు, పరవాడ, జనవరి 25 : 2025 విద్యా సంవత్సరంకు గాను సంస్కృతి గ్లోబల్ స్కూల్ నుండి ఆర్చరీ, షూటింగ్, స్విమ్మింగ్, బాక్సింగ్, వుషు క్రీడాంశాలు నుండి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వారు నిర్వహించిన జాతీయ స్థాయి లో పాల్గొన్నా 18 మంది క్రీడాకారులకు ప్రోత్సహ నియమిత్తం పరవాడ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్. మల్లిఖార్జున రావు చేతుల మీదుగా స్పోర్ట్స్ కిట్ కు బహుకరిచడం జరిగింది. ఈ క్రీడాకారులను అభినందనలు తెలుపిన సి.ఐ మల్లికార్జున రావు మాట్లాడుతూ ... రాష్ట్ర ప్రభుత్వం ఏది అయితే క్రీడవిధానం అమలు చేస్తుందో దానికి అనుగుణం గా ఈ పాఠశాల విద్యా తో పాటు క్రీడలకు మరియు క్రీడాకారులు అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ ఎన్. సీతాలక్ష్మి, సీఈఓ కె. నిశాంత్, ఉపాధ్యాయలు క్రీడా శిక్షకులు పాల్గొన్నారు.



# ఎస్సీ వర్గీకరణ అమలు కోసం లక్ష డప్పులు, వేల గొంతులు.

**– ఓ మాదిగ బిడ్డ చలో హైదరాబాద్..!**




తొలి అడుగు దినపత్రిక, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, జనవరి 25 : ఇటీవల అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పును అనుసరిస్తూ %ూాదీజణ% గా వర్గీకరిస్తూ ఉమ్మడి ఆంధ్ర మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు జీవో ను ఇవ్వాలని ప్రధాన డిమాండ్ తో రేపటి రోజు నా హైదరాబాద్ ట్యాంక్బండ్ వద్ద లక్ష డబ్బులు, వేల గొంతులు తో జరగనున్న సాంస్కృతిక కళ జాతన ను విజయవంతం చెయ్యాలి. అని రేపు అనగా 26/1/2025 ఆదివారం పడమర కండ్రిగ గ్రామంలో కపిలేశ్వరపు మండల ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, ఎం ఇ ఎఫ్ ఉద్యోగ సంఘ నాయకులు, మాదిగ నాయకులు, మాదిగ పెద్దలు, విద్యార్థి సంఘాల నాయకులు తో తాతపూడి సుధాకర్ కొమ్ము బాబురావు అధ్యక్షతన ఏర్పాటు చేయడమైనది. అదేవిధంగా ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పిప్పర సంపత్ రావు మండల కన్వీనర్ ఆశీర్వాదం కూడా మాన్య కృష్ణ మాదిగ చేపట్టిన లక్ష డొప్పులు వేల గొంతులు అనే ఈ కార్యక్రమాన్ని గ్రామస్థాయి మండల స్థాయి జిల్లాస్థాయిలో క్షేత్రస్థాయిలో కూడా ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని తెలియజేశారు.

# పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేక కృషి

**– రోగుల అవసరార్థం వినియోగించేందుకు దాతల నుంచి అయిదు లక్షల విరాళాల సేకరించి ఇస్తా**

**– కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు**

తొలి అడుగు దినపత్రిక, డాక్టరు బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, జనవరి 25 : కొత్తపేట పేదలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం తరుపున చేయాల్సిన కృషి చేస్తానని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కొత్తపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో శనివారం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యేగా ఉండగా ఆసుపత్రిని ఏ విధంగా అభివృద్ధి చేశానో మరలా అదే విధంగా ఆసుపత్రిని అభివృద్ధి చేసి పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.గత ప్రభుత్వ నిర్వాకంతో 70 పడకల ఆసుపత్రి 50 పడకల ఆసుపత్రిగా మారడం బాధాకరం అని మరలా ఈ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా మార్చేందుకు తగు చర్యలు తీసుకుంటామని వివరించారు. అలాగే నూతనంగా ఏర్పాటు అయిన ఈ కమిటీ ఆసుపత్రి అభివృద్ధికి,మెరుగైన వైద్య సేవలు అందించడానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ ప్రక్రియలో భాగంగా ఆసుపత్రికి వచ్చే రోగుల అవసరార్థం అవసరమైన వసతులు కల్పించేందుకు దాతల నుండి అయిదు లక్షల రూపాయల విరాళాలు సేకరించి ఇస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు.వాటిని తగు అవసరాలకు అనుగుణంగా ఖర్చు చేయాలని అలాగే ఎవరైనా దాతలు ముందుకు వచ్చి తగు సహాయం చేస్తామంటే తమను సంప్రదించాలని కోరారు.అలాగే నేటి సమావేశ తీర్మానంలో పొందుపరిచిన అంశాలను ఆమోదిస్తున్నామని సత్యానందరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# మాతృ వియోగం లో ఉన్న నూకాంబికా వీర్రాజు కు పరామర్శ

తొలి అడుగు దినపత్రిక, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, జనవరి 25 : ఆలమూరు మాతృ వినియోగంతో ఉన్న ఆలమూరు మండలం చింతలూరు నూకాంబిక అమ్మవారి దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఉండవల్లి వీర్రాజు చౌదరి ని మండలంలోని పలువురు నాయకులు పమర్శించారు. ఉండవల్లి వీర్రాజు మాతృ మూర్తి చిత్రపటానికి చింతలూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు గారపాటి శ్రీనివాస్ చౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాతృ వినియోగంతో ఉన్న వీర్రాజు ను పరామర్శించి ఓదార్చారు. చింతలూరు తోపాటు మండలం లోని పలువురు నాయకులు పమర్శించారు.



# సంపాదకీయం

రాజ్యాంగాన్ని బలహీనపరుస్తున్న శక్తులు...

1950 జనవరి 26 న రాజ్యాంగం అమలులోకి వచ్చింది. దేశం రిపబ్లిక్‌గా అవతరించింది. నాటి నుండి ప్రభుత్వపరంగా రిపబ్లిక్ దినోత్సవాలు జరుగుతున్నాయి. అవి ప్రభుత్వ శాఖలు, సంస్థలకే పరిమితమై, ప్రజల భాగస్వామ్యం లేకుండా సాగిపోతున్నాయి. రాజ్యాంగం మనందరిదీ. మనకు మనమే సమర్పించుకున్న రాజ్యాంగం. ఈ రాజ్యాంగానికి మనమే యజమానులం. దేశంలో అత్యధిక సంఖ్యాకులు శ్రమజీవులు. పరిశ్రమలలో కార్మికులుగా, అసంఘటిత రంగ శ్రామికులుగా, వృత్తి సంఘాల సభ్యులుగా, వ్యవసాయకూలీలుగా, కౌలు రైతులుగా, స్వయంగా సాగు చేస్తున్న రైతులుగా పలు రంగాల్లో వున్నారు. అలాగే వివిధ రంగాల్లో సమాజానికి సేవలు అందిస్తున్న వారు వున్నారు. దేశ సంపద ఉత్పత్తిలో ఈ శ్రమజీవులే కీలకపాత్ర పోషిస్తున్నారు. దేశంలో అన్ని రంగాలకు శిరోధార్యంగా వున్న రాజ్యాంగ కార్యకలాపాల్లో ప్రజల భాగస్వామ్యం వుండి తీరాలి. అలాంటి భాగస్వామ్యాన్ని మనకు మనమే కల్పించుకోవాలి. ప్రజా రిపబ్లిక్ దినోత్సవం మనకోసం మనమే నిర్వహించుకోవాలి. ఆర్థిక రంగంలో సంపద సృష్టిలో కీలక పాత్ర పోషిస్తున్న సకల రంగాల శ్రమజీవులు రాజకీయ రంగంలో కేవలం ఓటర్లు గానే మిగిలిపోకూడదు. రాజ్యాంగంమీద రాజకీయంగా జరుగుతున్న దాడిని రాజకీయంగా ప్రతిఘటించడానికి సిద్ధపడాలి. కేంద్రంలో అధికారంలో వున్న మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరిచి, దానిని మార్చడానికి అడుగులు వేస్తున్నది. మోడీ ఎలాంటి దాపరికం లేకుండా తనకు తాను హిందూ జాతీయవాదినని ప్రకటించుకున్నారు. మెజారిటీ జాతీయవాదానికి వీలుగా పౌరసత్వ చట్టాలను తెచ్చారు. మత విద్వేష రాజకీయాలు చేస్తున్నారు. బిజెపి మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ బహిరంగంగానే రాజ్యాంగాన్ని సవాలు చేస్తున్నది. హిందూ రాష్ట్ర నినాదం త్వరలోనే సాకారం కానున్నదని ప్రకటించింది. భారత రాజ్యాంగం పట్ల ఆర్‌ఎస్‌ఎస్ వైఖరి అందరికీ తెలిసిందే. రాజ్యాంగం ఆమోదించినప్పుడే వారు వ్యతిరేకించారు. ఇది అతుకుల బొంత రాజ్యాంగం అన్నారు. దీనిలో జాతీయత లేదన్నారు. అంతటితో సరిపెట్టుకో లేదు. ప్రపంచ ప్రశంసలు పొందిన మనుధర్మశాస్త్రమే దేశానికి తగిన రాజ్యాంగం అని ప్రకటించారు. ఇప్పుడు జరుగుతున్నది రాజ్యాంగానికి, ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్ర నినాదానికి మధ్య సంఘర్షణ. రాజ్యాంగాన్ని మట్టుపెట్టాలనే ఈ సంఘర్షణలో శ్రమజీవులు పాత్రధారులు కావాలి. ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్ర నినాదం దేశాన్ని మత రాజ్యంగా మారుస్తుంది. మత రాజ్యాలలో రాజ్యాంగాలు వుండవు. మత గ్రంథాలే రాజ్యాంగం పాత్ర నిర్వహిస్తాయి. హిందూ రాష్ట్రలో మనుధర్మ శాస్త్రం రాజ్యాంగం అవుతుంది. శ్రమజీవులు పని విభజన అర్హతను బట్టి కాకుండా కులాలనుబట్టి నిర్ణయమవుతుంది. హిందూ రాష్ట్రలో శ్రమజీవులు శాశ్వతంగా కట్టుబానిసలౌతారు. కులవిభజన శ్రమజీవుల ఐక్యతకు భంగం కలిగిస్తుంది. మత రాజ్యాలలో ప్రజాస్వామ్యం వుండదు. పౌర హక్కులు వాటికి చట్టబద్ధత వుండదు. శిక్షలు తప్పునుబట్టి కాకుండా కులాల ఆధారంగా వుంటాయి. మత రాజ్యాలలో ఓటు హక్కు, ఎన్నికలు వుండవు. నియంతలే వుంటారు ప్రస్తుతం ఓటు హక్కు వున్నందునే వివిధ పథకాలు పేరుతో రాజకీయం శ్రమజీవులను పట్టించుకోకతప్పడంలేదు. ప్రభుత్వాలను మార్చేశక్తి మన ఓటులో వుంది. మత రాజ్యాలలో వివక్ష వుంటుంది. మైనారిటీ మతస్థులు సమాన హక్కులలేని రెండవ తరగతి పౌరులవుతారు. మహిళలు, దళితులు, బహుజనులపట్ల వివక్ష కొనసాగుతుంది. అందువల్ల శ్రమజీవులు సమైక్యంగా రాజ్యాంగ రక్షణకు పూనుకోవాలి. హిందూ రాష్ట్ర నినాదాన్ని రాజకీయంగా ఎదుర్కొనాలి. ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్ర నినాదం దాడి నుండి రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ఎంత అవసరమో రాజ్యాంగ ఫలాలను దక్కించుకోడానికి తగిన విధంగా దానిని అమలు చేయించడానికి ఉద్యమించడమూ అంతే అవసరం. ఈ ఉద్యమానికి కూడా ప్రజా రిపబ్లిక్ దినోత్సవం వేదిక కావాలి. రాజ్యాంగం పీఠిక ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పించాలని ప్రకటించింది. కాని సామాజిక రంగంలో కుల వివక్ష, మహిళల పట్ల వివక్ష, మైనారిటీల పట్ల వివక్ష నేటికీ కొనసాగుతున్నది. అమానుషమైన దాడులు, అత్యాచారాలు, హత్యాకాండ సాగిపోతున్నది. వివక్ష వున్నచోట సమానత్వం వుండదు. ప్రజాస్వామ్య విలువలు వుండవు. సమాన అవకాశాలు వుండవు. శ్రమజీవులు వివక్షకు తావులేని ప్రజా రిపబ్లికన్ను సాధించుకోవాలి. రాజ్యాం గం అందరికీ ఆర్థిక న్యాయం జరగాలని ప్రకటించింది. దీనికి సమాజంలో అంతరాలు తగ్గాలి. అందరికీ అవకాశాలు లభించాలి. కాని గత 10 సంవత్సరాలలో అంతరాలు విపరీతంగా పెరిగాయి. 1 శాతం మంది కార్పొరేట్లు, బిలియనీర్ల దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడింది. 10 శాతం మంది దగ్గర 78 శాతం దేశసంపద గుట్టపడింది. ఈ కార్పొరేట్లకే కేంద్ర ప్రభుత్వం 20 లక్షల కోట్ల రూపాయలు పన్ను రాయితీలు, రుణమాఫీలు ఇచ్చింది. 60 శాతంగా వున్న సామాన్యులు, పేదల దగ్గర కేవలం 5 శాతం సంపద మాత్రమే వుంది. అత్యధిక ఆర్థిక అంతరాలున్న దేశాల్లో మన దేశం అగ్రస్థానంలో వుంది. దేశ ప్రజలకు ఆర్థిక న్యాయం అన్నది అర్థరహితంగా మారింది. సకల తరగతుల శ్రామికులు కేవలం నెల జీతగాళ్ళు, రోజువారీ కూలీలు మాత్రమే కాదు. వీరే సరుకులను, సంపదను, సేవలను సృష్టిస్తున్నారు. ఈ సంపదలో తగిన వాటా వారికి దక్కడం లేదు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రకారం దేశసంపద, సహజ వనరులు ప్రజలందరికీ చెందాలి. దీనికి విరుద్ధంగా మోడీ ప్రభుత్వం అడవులను, గనులను, సముద్ర తీరాలను తన కార్పొరేట్ మిత్రులకు ధారాదత్తం చేసింది. వాటి నుండి కోట్లాది సంపదను ప్రయివేటు వ్యక్తులు సొంతం చేసుకుంటున్నారు. మరో ఆదేశిక సూత్రం ప్రకారం సంపద కొద్దిమంది దగ్గర పోగుపడకూడదు. కాని పోగుపడింది. దానిని వికేంద్రీకరించాలి. ఈ సంపదలలో తగిన వాటా శ్రమజీవులకు దక్కాలి. కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపదను పునఃపంపిణీ చెయ్యాలి. కార్పొరేట్ పన్ను పెంచడం, వారసత్వ పన్ను, సంపద పన్ను విధించడం ద్వారా దాదాపు 20 లక్షల కోట్ల రూపాయల అదనపు ఆదాయం సమకూరుతుందని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ అదనపు నిధులతో జాతీయ సంక్షేమ నిధిని ఏర్పాటు చెయ్యాలి. ఈ సొమ్ముతో శ్రమ జీవులందరికీ హక్కుగా నివాసం, ఆహార భద్రత, విద్య-వైద్య సదుపాయాలు, కనీస మౌలిక ఆదాయం కల్పించాలి. ఈ నిధుల నుండి రైతుల పంటలకు లాభసాటి ధరలు, నిరుద్యోగానికి శాశ్వత పరిష్కారాలు సాధించాలి. ఆదేశిక సూత్రాలలో కార్మికులకు పరిశ్రమల యాజమాన్యంలో భాగస్వామ్యం కల్పించాలని సూచిస్తే దానికి విరుద్ధంగా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్‌లను ఈ ప్రభుత్వం తెచ్చింది. కార్మికులకు హేతుబద్ధమైన పని గంటలు వుండాలని ఆదేశిక సూత్రాలు ఘోషిస్తుంటే ఈ ప్రభుత్వం 12 -16 గంటల పని దినానికి జెండా ఊపింది. ఈ తరహా రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమైన ప్రతి చర్యను శ్రమజీవులు ప్రతిఘటించాలి. ప్రజా రిపబ్లిక్ అన్నది శ్రమజీవుల రాజకీయ నినాదం. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ల రాజకీయాలను, భావజాలాలను ఓడించడం ఒక లక్ష్యం. కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపద పునఃపంపిణీ ద్వారా శ్రమజీవు లందరికీ గౌరవప్రదమైన స్వతంత్ర జీవనాన్ని సాధించడం మరో లక్ష్యం. దోపిడీ, వివక్షలు లేని సమాజాన్ని సాకారం చేసుకునే అంతిమ లక్ష్యానికి సాగిపోవాలి. పలు రంగాలలో చీలిపోయిన శ్రమజీవులు, వివక్ష తరగతుల సమూహాలు ఒక్కటైతే అది ప్రజాఉద్యమం అవుతుంది, ఉప్పెనగా మారుతుంది. అసాధ్యాలను సుసాధ్యం చేస్తుంది.

# ఓటుకు మించిన ఆయుధం లేదు

**– కొత్తపేటలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే సత్యానందరావు**




తొలి అడుగు దినపత్రిక, డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా, జనవరి 25 : కొత్తపేట ఓటుకు మించిన ఆయుధం మరొకటి లేదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపేటలోని విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే సత్యానందరావు,ఆర్డీఓ శ్రీకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ మన భవిష్యత్తును నిర్ణయించే ఓటు మన చేతిలోని ఆయుధమని దాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం అధిక సార్లు ఓటు హక్కు వినియోగించుకొన్న సీనియర్ సిటిజన్ లకు మరియు కష్ట పరిస్థితులలో సైతం ఓటును వినియోగించుకున్న దివ్యాంగులకు ఎమ్మెల్యే సత్యానందరావు, ఆర్డీఓ శ్రీకర్ దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ఓటర్ జాతీయ దినోత్సవం




తొలి అడుగు, పరవాడ, జనవరి 25 : మండల కేంద్రమైన పరవాడ గ్రామంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జాతీయ ఓటర్ దినోత్సవ సందర్భంగా పరవాడ పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి మురళి పట్నాయక్ ఆధ్వర్యంలో ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు భారత ఎన్నికల సంఘం ప్రతిఏటా జనవరి 25వ తేదీన దేశవ్యాప్తంగా జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి మూలస్తంభం ఓటని భారతదేశ పౌరులుగా మరియు ఓటర్ గా ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఉందని గుర్తు చేశారు. అనంతరం అధిక సార్లు ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజనులకు మరియు కష్ట పరిస్థితుల్లో సైతం ఓటును వినియోగించుకున్న దివ్యాంగులకు పంచాయతీ కార్యదర్శి మురళి పట్నాయక్ దుశాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, సీనియర్ సిటిజెన్లు, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పిఎం సూర్య ఘర్ యోజనపై అవగాహను




తొలి అడుగు, పరవాడ, జనవరి 25 : మండల కేంద్రమైన పరవాడ గ్రామం మరిడిమాంబ ఫంక్షన్ హాల్ లో శనివారం నాడు పి.ఎం సూర్య ఘర్ యోజన పథకంపై ఏపీ ఈ పి డి సీ ఎల్ ఆధ్వర్యంలో గృహ వినియోగదారులకు, గ్రామస్తులకు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కసింకోట డి. ఈ రామకృష్ణ, అనకాపల్లి సబ్ డివిజన్ ఏ డి ఈ కనకరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డి. ఈ రామకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు అందరూ కూడా వారి యొక్క ఇంట్లోనే విద్యుత్ నీ తయారు చేసుకునే అవకాశం ఉందని , సోలార్ ద్వారా విద్యుత్తుని తయారు చేసుకుని, ఆ విద్యుత్ ని వారు వినియోగించుకోవడమే కాకుండా ఎక్సెస్ అధిక వినియోగాన్ని కూడా విద్యుత్ తయారైతే ఆ విద్యుత్ నీ డిపార్ట్మెంట్ వెనక్కి ఇవ్వడం ద్వారా వారు కూడా లబ్ధి పొందచ్చని, మరి అలాగే ఈ కార్యక్రమాన్ని ప్రధానమంత్రి మోడీ సుమారు కోటి మంది గృహాలకి చేర్చాలని ఉద్దేశంతో ఈ బ్రహుత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. దీనికోసం ప్రతి ఒక్క కిలో వాట్ ఇన్స్టాలేషన్ కి 30 వేల రూపాయలు సబ్సిడీ ఇవ్వాలని చెప్పి , అలాగే రెండు కిలో వాట్లు ఇన్స్టాలేషన్ చేసుకునే వాళ్ళకి 60 వేల రూపాయలు ఇవ్వాలని, మూడు కిలో వాట్లు పెట్టుకునే వాళ్ళకి 70 వేల రూపాయల వరకు సబ్సిడీ ఇచ్చి గృహ వినియోదారులందరూ కూడా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ఒక మంచి కార్యక్రమాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పరవాడ గ్రామంలో మన వినియోగదారులందరకీ కూడా తెలియజేసి వారందరికీ కూడా చైతన్యం చేయాలనే ఉద్దేశంతో ఈ రోజున స్థానికంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని. అందరూ కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకొని మన దేశ అభివృద్ధిలో కూడా మీరందరూ పాలుపంచుకోవాలని చెప్పి ప్రధానమంత్రి మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి వారి యొక్క సందేశాన్ని మీ అందరికీ తెలియజేయాలని ఉద్దేశంతో ఈ యొక్క కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో ఏడీఇ కనకారావు, ఏఈ శేష సాయి, లైన్ మేన్ లు , లైన్ ఇన్స్పెక్టర్లు, విద్యుత్ అధికారులు , గృహ వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.


తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక



# విష్ణు కెమికల్స్ కంపెనీ లో ప్రమాదం

తొలి అడుగు, పరవాడ, జనవరి 25: అనకాపల్లి జిల్లా పరవాడ మండలం పరవాడ ఫార్మసిటీలో విష్ణు కెమికల్ పరిశ్రమలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. శనివారం నాడు విధులు నిర్వహిస్తుండగా కన్వీనర్ బెల్ట్ లో ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కాంట్రాక్ట్ కార్మికుడు రాజ్ వీర్ 20 మృతి పై సమగ్ర విచారణ చేయాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం గని శెట్టి కే జీ హెచ్ కి వెళ్లి మార్చురీ లో మృతదేహాన్ని పరిశీలించి అనంతరం ఆయన జరిగిన ప్రమాదంపై సమగ్ర విచారణ చేసి చర్యలు చేపట్టాలని పరిశ్రమంలో వరుస ప్రమాదాలతో భయాందోళనకు గురవుతున్నారని అరిచేతుల ప్రాణాలు పెట్టుకుని కార్మికులు ఫార్మా పరిశ్రమల విధులు నిర్వహిస్తున్నారని మృతి చెందిన రాజ్ వీర్ కుటుంబానికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.






# రాజ్యాంగ మూలప్రతి రూపకర్త

తొలి అడుగు, బెనెగల్ నరసింహా రావు భారత దేశంలో దాదాపు తెర మరుగైన వ్యక్తి, కనుమరుగైన పేరు. బి.ఎన్.రావుగా నాడు సుపరిచితులయిన ఆయన భారత రాజ్యాంగం రూపొందించిన అసలు వ్యక్తి అని తెలిస్తే ఆశ్చర్యం కలుగక మానదు.రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షులుగా బాబా సాహెబ్ ఎన్నుకోబడిన సందర్భంలో ఆయన అన్న మాటలు.. "షెడ్యూల్డ్ కులాల ప్రయోజనాలను కాపాడుకోవడం అనే ఒకే ఒక్క తలంపుతో వచ్చిన నాకు రాజ్యాంగ అసెంబ్లీలో ఇటువంటి మరింత బాధ్యతాయుతమ్మైన అధికారం చేపట్టమని నాకు అప్పగించారు. రాజ్యాంగ అసెంబ్లీ నన్ను డ్రాఫ్టింగ్ కమిటీకి సభ్యుడిగా నన్ను ఎన్నుకున్నప్పుడు నేను చాలా ఆశ్చర్య పోయాను. అలాగే అంతకు మించి నేను ముసాయిదా కమిటీకి ఛైర్మన్ గా ఎన్నుకో బడినప్పుడు మరింత ఆశ్చర్యపడ్డాను. ఎందుకంటే అప్పటికే డ్రాఫ్టింగ్ కమిటీలో నాకన్నా మెరుగ్గైన, మరింత సమర్ధవంతుల్కైన వారుండటం. అలాగే... "నాకు ఇచ్చిన క్రెడిట్ నిజంగా నాకు చెందినది కాదు. ఇది కొంతవరకు రాజ్యాంగ అసెంబ్లీకి రాజ్యాంగ సలహాదారు సర్ బిఎన్ రావుకు చెందినది, వారు ముసాయిదా కమిటీ పరిశీలన కోసం రాజ్యాంగం యొక్క కఠినమైన ముసాయిదాను సిద్ధం చేశారు". అని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 25 నవంబర్ 1949 న రాజ్యాంగ అసెంబ్లీలో తన ముగింపు ప్రసంగంలో పేర్కొన డాన్ని బట్టి నరసింహా రావు ప్రతిభ, గొప్పతనం స్పష్టం అవుతున్నది. రాజ్యాంగ అసెంబ్లీ అధ్యక్షుడు డా. బాబు రాజేంద్ర ప్రసాద్ గారు కూడా రాజ్యాంగ సంతకం రోజున బి.ఎన్.రావు కృషిని కీర్తిస్తూ చేసిన ప్రస్తావన రావు ప్రతిభను తేటతెల్లం చేస్తున్నది. 1887 ఫిబ్రవరి 26న సంప్రదాయ బ్రాహ్మణ మేధావుల కుటుంబంలో మంగళూరులో జన్మించి, సివిల్ సర్వీసెస్, న్యాయ శాస్త్ర పారంగ తునిగా పేరెన్నిక గని, బ్రిటిష్ ఇండియాలో న్యాయమూర్తిగా పని చేసి, అపార అనుభవం గడించి, 1947 లో బర్మా మరియు 1950 లో భారతదేశం యొక్క రాజ్యాంగాలను రూపొందించడంలో ప్రధాన పాత్ర పోషించారు. నరసింహా రావు (26 ఫిబ్రవరి 1887 - 30 నవంబర్ 1953) 1950 నుండి 1952 వరకు ఐక్యరాజ్య సమితి భద్రతా మండలికి అధ్యక్షునిగా ఉన్నారు. ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి (1950%-%52) లో భారత ప్రతినిధిగా, అధ్యక్షుడిగా పని చేశారు. కొంతకాలం (1944-45) జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర మంత్రిగా పనిచేశారు . ఫిబ్రవరి 1952 నుండి మరణించే వరకు, హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థాన న్యాయమూర్తిగా పనిచేశారు. తూర్పు బెంగాల్ లోని అనేక జిల్లాల్లో న్యాయమూర్తిగా పనిచేశారు. 1925 లో, అస్సాం ప్రభుత్వం ప్రావిన్షియల్ కౌన్సిల్ కార్యదర్శిగా సుమారు ఎనిమిది సంవత్సరాలు ఈ పదవిలో పనిచేశారు. ఈ విధులతో పాటు, సైమన్ కమిషన్‌కు ఆర్థిక సహాయం కోసం మెమోరాండాను రూపొందించడం విషయంలో అస్సాం ప్రభుత్వానికి సహకరించారు. వాటర్స్ కమిషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. కలకత్తా హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేశారు. జమ్మూ కాశ్మీర్ రాచరిక ప్రధాన మంత్రిగా ఉంటూ,1945 లో అప్పటి కాశ్మీర్ మహారాజాతో విభేదాలను అనుసరించి ఆయన ఈ పదవికి రాజీనామా చేశారు. సంస్కరణల కార్యాలయంలో ఉండటానికి మరియు రాజ్యాంగ మరియు సమాఖ్య సమస్యలపై పనిచేయడానికి ఇష్టపడగా, గవర్నర్ జనరల్ కార్యాలయంలో కార్యదర్శిగా నియమించ బడ్డారు., రాజ్యాంగ సంస్కరణలపై పనిచేశారు. రావు 1946 లో రాజ్యాంగ అసెంబ్లీకి రాజ్యాంగ సలహాదారుగా నియుక్తులు అయినారు. రాజ్యాంగ ముసాయిదా రాజ్యాంగంపై చర్చలో నిమగ్నమై ఉండగా, హైదరాబాద్ నిజాం మరియు భారత ప్రభుత్వాల మధ్య జరిగిన వివాదంలో ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి జోక్యం చేసుకోగలదా అనే ప్రశ్నపై సంక్షిప్త సమాచారం సిద్ధం చేయడానికి రావు పనిచేశారు.1946 లో భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో రాజ్యాంగ సభకు రాజ్యాంగ సలహాదారుగా బిఎన్ రావు నియమించ బడ్డారు. ఫిబ్రవరి 1948 లో దాని ప్రారంభ ముసాయిదాను సిద్ధం చేశారు. ఇట్టి ముసాయిదాను 26 నవంబర్ 1949 న భారత రాజ్యాంగ సభ చర్చించింది, సవరించింది మరియు చివరకు స్వీకరించింది. భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో తన పరిశోధనలో భాగంగా, 1946లో, ఆయన యుఎస్, కెనడా, ఐర్లాండ్ మరియు యునైటెడ్ కింగ్‌డమ్‌లలో పర్యటించారు, అక్కడ రాజ్యాంగ చట్టంపై న్యాయ మూర్తులు, పండితులు మరియు అధికారులతో వ్యక్తిగత సంప్రదింపులు జరిపారు. ఇతరులలో, అమెరికన్ సుప్రీంకోర్టు జస్టిస్ ఫెలిక్స్ ఫ్రాంక్‌ఫర్టర్‌ను కలిశారు. రాజ్యాంగ సలహాదారుగా అయన తయారుచేసిన ముసాయిదా అక్టోబర్ 1947 లో సమర్పించ బడింది. ఇతరదేశాల యొక్క రాజ్యాంగాలప్కై తనకు గల విస్తృత పరిజ్ఞానంతోఅలాగే మన దేశంలోని పరిస్థితులప్కై తనకు గల అపార అధికార నైపుణ్యం తో పాటు తన స్వంత పరిపాలనా అనుభవము రంగరించి తన బాధ్యతను సక్రమంగా నెరవేర్చారు రావు. ఈ ముసాయిదాతో పాటు, రాజ్యాంగ అసెంబ్లీ ఏర్పాటు చేసిన వివిధ ఇతర కమిటీలు ప్రతిపాదించినవి పరిగణనలోకి తీసుకోబడ్డాయి.బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన 1947 ఆగస్టు 29 న ముసాయిదా కమిటీని ఏర్పాటు చేసిన రాజ్యాంగ అసెంబ్లీ తీర్మానం, "రాజ్యాంగ సలహాదారుగా రావు తయారుచేసిన రాజ్యాంగం యొక్క ముసాయిదాను పరిశీలించడానికి, అప్పటికే అసెంబ్లీలో తీసుకున్న నిర్ణయాలను అమలులోకి తెచ్చేందుకు, దానికి సంబంధించిన అన్ని విషయాలను చేర్చడానికి లేదా మార్చుటకు చర్యలు చేపట్టడం జరిగింది. ముసాయిదా కమిటీ మొదటి ముసాయిదాను 1948 ఫిబ్రవరిలో ప్రచురించింది. ముసాయిదాపై చర్చించడానికి, సవరణలను ప్రతిపాదించడానికి భారత ప్రజలకు ఎనిమిది నెలల సమయం ఇవ్వబడింది. ప్రజల వ్యాఖ్యలు, విమర్శలు మరియు సలహాల వెలుగులో, బిఆర్ అంబేద్కర్ 4 నవంబర్ 1948 న (మొదటి పఠనం) తర్వాత రెండవ పఠనం నిబంధన పరిశీలనకు ఒక సంవత్సరం పట్టింది. మూడు చిత్తుప్రతులు మరియు మూడు రీడింగుల తరువాత, రాజ్యాంగం 26 నవంబర్ 1949 న ఆమోదించినట్లు ప్రకటించబడింది. ఇక బి.ఎన్. రావే స్వయంగా రాజ్యాంగపు మొదటి విడతగా 243 ఆర్టికల్స్ (వర్గాలు) వ్రాసి రాజ్యాంగ రచనా కమిటీకి అందజేశారు. ఆ కమిటీ సభ్యులు కలసి రావు ప్రాథమికంగా రూపొందించిన 243 ఆర్టికల్స్‌ను 315గా రూపొందించారు.


# చెక్కుపై నల్ల ఇంక్‌తో సంతకం చేయకూడదా?



తొలి అడుగు, చాలా మంది డబ్బుల విషయంలో ఇతరులకు చెక్‌ను ఇస్తుంటారు. చెక్‌పై సంతకం చేసేటప్పుడు రిజర్వ్ బ్యాంక్ నియమ నిబంధనలు రూపొందించింది. అయితే సోషల్ మీడియాలో ఓ వార్త వైరల్ అవుతోంది. చెక్‌పై బ్లాక్ ఇంక్ పెన్‌తో సంతకం చేస్తే చెల్లదని, అలా చేయకూడదని వైరల్ అవుతోంది. సోషల్ మీడియాలో రకరకాల వార్తలు చక్కర్లు కొడుతుంటాయి. అందులో కొన్ని నిజాలు ఉంటాయి.. మరి కొన్ని అబద్దాలు కూడా ఉంటాయి. వీటితో పాటు తప్పుడు సమాచారం కూడా సృష్టించి ప్రచారం చేస్తున్నారు. అయితే చెక్కుపై నల్ల సిరాతో సంతకం చేయకూడదు, అలా చేస్తే చెక్ చెల్లదని, ఇదీ ఆర్‌బీఐ మార్గదర్శకాలు అంటూ ఓ పోస్ట్ వైరల్‌గా మారింది. ఈ వైరల్ పోస్ట్‌పై ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఖాతా స్పందిస్తూ అది తప్పుడు సమాచారమని స్పష్టం చేసింది. నల్ల ఇంకుతో చెక్కులు రాయకూడదని ఆర్బీఐ ఆదేశించిందంటూ సోషల్ మీడియాలో పోస్ట్ లు హల్ చల్ చేస్తున్నాయి. ఇది పూర్తిగా తప్పుడు సమాచారం. "చెక్‌పై రాయడానికి అటువంటి రంగు ఇంక్ ఉపయోగించాలని =దీ× ఎటువంటి మార్గదర్శకాలను జారీ చేయలేదు" అని౹ా×దీ ఫాక్ట్ చెక్ తన ఎక్స్-పోస్ట్‌లో పేర్కొంది. ఆర్బీఐ చెక్ ట్రంకేషన్ సిస్టమ్ ప్రకారం, చెక్‌పై రాసేటప్పుడు స్పష్టంగా, శాశ్వతమైన ఇంక్‌ని ఉపయోగించాలి. ఇది రాసిన దానిని మార్చదు. ఇది ఆర్‌బీఐ మార్గదర్శకాల్లో పేర్కొన్న నిబంధన. అయితే చెక్కులో నిర్దిష్టమైన ఇంకు రంగులు రాయాలని ఎక్కడా పేర్కొనలేదు. మరో వాస్తవం ఏమిటంటే, చెల్లింపుదారుడి పేరు, వారికి ఇవ్వాల్సిన డబ్బు చెక్కుపై సంఖ్యలు, అక్షరాలతో రాయాలి. ఒకసారి రాసిన తర్వాత మార్చలేము. అటువంటి టాంపర్డ్ లెటర్, నంబర్‌తో కూడిన చెక్కు బ్యాంకుచే తిరస్కరించబడుతుంది. మీరు చెక్కు జారీ చేసేటప్పుడు ఏదైనా తప్పుగా గుర్తించినట్లయితే, దాన్ని సరిదిద్దడానికి బదులుగా, కొత్త చెక్కును జారీ చేయండి.

# అదానీకి శ్రీలంక సర్కారు షాక్!

తొలి అడుగు, విద్యుత్ కొనుగోలు ఒప్పందానికి సంబం?ధించి ఆంధ్రప్రదేశ్ ఉన్నతాధికారులకు భారీగా లంచాలు ముట్టజెప్పిందన్న ఆరోపణలపై అమెరికాలో దర్యాప్తు ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్‌నకు తాజాగా మరో షాక్ తగిలింది. ఆ ఆరోపణల నేపథ్యంలో శ్రీలంక కూడా తమ దేశంలో అదానీ గ్రీన్ ఎనర్జీ నిర్మిస్తున్న పవన విద్యుత్ ప్రాజెక్టులపై దర్యాప్తు ప్రారంభించినట్లు అంతర్జాతీయ న్యూస్ ఏజెన్సీ ఏఎఫ్‌పీ కథనం పేర్కొంది. అంతేకాదు, గత ఏడాది మే నెలలో అదానీ గ్రీన్ ఎనర్జీతో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని శ్రీలంక ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని, ఆ దేశ విద్యుత్ శాఖ ఉన్నతాధికారి ఈ విషయాన్ని ధ్రువీకరించారని తన కథనంలో వెల్లడించింది. శ్రీలంక ఉత్తర ప్రాంతంలోని మన్నార్, పూణెరిన్‌లో మొత్తం 484 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన పవన విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు ఆ ప్రాజెక్టుల నుంచి ఉత్పత్తి చేసే విద్యుత్‌ను 20 ఏళ్ల పాటు కొనుగోలు చేసేందుకు ఆ దేశ మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అదానీ గ్రూప్ ఈ వార్తలను ఖండించింది. అవి పూర్తిగా తప్పుడు, పక్కదోవ పట్టించే కథనాలేనని తన ప్రకటనలో పేర్కొంది. "ప్రాజెక్టు పూర్తిగా రద్దు కాలేదు. సాధారణ సమీక్ష ప్రక్రియలో భాగంగా శ్రీలంక ప్రస్తుత ప్రభుత్వం గత సర్కారు హయాంలో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పంద చార్జీలను పునః సమీక్షించాలని నిర్ణయించింది. శ్రీలంక పునరుత్పాదక రంగంలో 100 కోట్ల డాలర్ల (రూ.8,600 కోట్లు) పెట్టుబడులు పెట్టడంతో పాటు ఆ దేశ హరిత ఇంధన రంగం, ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపించే విషయంలో తమ గ్రూప్ కట్టుబడి ఉంద"ని అదానీ గ్రూప్ అధికారిక ప్రతినిధి పేర్కొన్నారు.





తొలిఅడుగు
తెలుగు దిన పత్రిక

## రైస్ పాడవకుండా ఎలా ఉంచాలి..?



**తొలిఅడుగు, ఆరోగ్యం :** ఉదయాన్నే వండిన బియ్యం రాత్రి వరకు పాడవకుండా ఉంచుకోవడానికి కొన్ని చిట్కాలు పాటించాలి. ఈ చిన్న చిట్కాలు పాటించడం ద్వారా బియ్యం రుచితో పాటు తేమను కోల్పోకుండా ఉంచటానికి చాలా ఉపయోగ పడుతుంది. పెద్ద వేడుకలు లేదా రోజువారీ వంటకు ఈ చిట్కాలతో అవసరం ఉంటుంది. ఉదయాన్నే వండిన రైస్ పాడవకుండా తాజాగా ఉంచుకోవడానికి మీరు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. ఇది పండగలు, పెళ్లిళ్లు, ఇతర వేడుకల సమయంలో ఉపయోగపడుతుంది. ఈ పద్ధతిని అనుసరించడం ద్వారా రైస్ రుచిగా ఉండడమే కాకుండా.. ఎక్కువసేపు పాడవకుండా ఉంటుంది. రూమ్ లలో అధిక వేడి కారణంగా మనం వండే రైస్ చాలా త్వరగా పాడవుతుంది. ఉదయం వండిన రైస్ ని మధ్యాహ్నం లేదా రాత్రికి ఉపయోగించే సమయంలో అప్పటికప్పుడే తినలేని పరిస్థితి ఉంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఇది ముఖ్యంగా చాలా సమయం ముందే వండిన రైస్ కి అనుకూలంగా ఉంటుంది. రైస్ సరిగ్గా ఉడికించడానికి బియ్యం పూర్తిగా మృదువుగా ఉడికిన సమయంలో ఒక టీస్పూన్ కొబ్బరి నూనెను అందులో వేసి కలపాలి. ఇది రైస్ ని పుల్లలు పుల్లలుగా ఉండేలా చేస్తుంది. కొబ్బరి నూనె వాసన కూడా ఉండదు. రైస్ నూనెతో మృదువుగా తయారవ్వడంతో పాటు రుచికరంగా ఉంటుంది.రైస్ ని వడగట్టిన వెంటనే అదే పాత్రలో ఉంచకూడదు. ఇలా చేస్తే వేడి కారణంగా రైస్ త్వరగా పాడవుతుంది. దీని కోసం ఒక పెద్ద పాత్ర లేదా హాట్ బాక్స్ తీసుకుని దాని లోపల శుభ్రమైన తెల్లని క్లాత్ ని వేయాలి. ఆ తర్వాత వడగట్టిన రైస్ ని క్లాత్ లో పెట్టి, బాగా మూతపెట్టాలి. రైస్ వేడి తగ్గేంతవరకు అలాగే ఉంచితే రైస్ తాజాగా ఉంటుంది. అంతేకాకుండా ఇది వేడి కారణంగా ఉబ్బడం లేదా పాడవ్వడం జరగదు. ఈ విధానాన్ని పాటిస్తే.. రైస్ పూర్తిగా ఉడికినప్పటికీ అది తినడానికి బాగా మృదువుగా ఉంటుంది. ఇలా చేయడం వల్ల రోజువారీ ఉపయోగం మాత్రమే కాకుండా పెద్ద కార్యక్రమాల్లో కూడా ఉపయోగపడుతుంది. మీరు ప్రయత్నించి మీ కుటుంబ సభ్యులందరికీ తెలియజేయండి.

# చికెన్ ప్రియులకు షాకింగ్ న్యూస్..!

**తొలిఅడుగు, ఆరోగ్యం :** చికెన్ అంటే చాలా మందికి ఎంతో ఇష్టం. ప్రత్యేకంగా ఆదివారం చికెన్ లేకుండా గడపడం కొందరికి అసాధ్యం. ఇది అందుబాటులో ఉండే నాన్ వెజ్ ఆహారాల్లో అందరూ ఇష్టపడేది. కానీ చికెన్ లో కొన్ని భాగాలను తినడం మన ఆరోగ్యానికి హానికరం అని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం. చాలామంది కోడి మెడ భాగాన్ని ఎంతో ఇష్టంగా తింటుంటారు. కానీ ఈ భాగంలో కోడి శోషరస వ్యవస్థ ఉంటుంది. శోషరస వ్యవస్థ శరీరంలోని వ్యర్థాలు, బ్యాక్టీరియాలను బయటకు పంపుతుంది. ఈ విషతుల్య పదార్థాలు కోడి శరీరంలో చేరే ప్రమాదం ఉంది. ఈ భాగాన్ని తింటే, వాటిలో ఉండే హానికరమైన పదార్థాలు మన శరీరంలోకి చేరి అనారోగ్య సమస్యలను కలిగించవచ్చు. అందుకే కోడి మెడను తినకూడదు. కోడి తోక భాగం గురించి కొందరు పెద్దగా పట్టించుకోరు. కానీ ఈ భాగం చాలా హానికరమైన క్రిములు, బ్యాక్టీరియాలను కలిగి ఉంటుంది. ఈ క్రిములు తిన్న వెంటనే శరీరంపై ప్రభావం చూపకపోవచ్చు, కానీ ఆ తరువాత ఆరోగ్య సమస్యలకు కారణమవుతాయి. కాబట్టి కోడి తోక భాగాన్ని తినకుండా వదిలేయడం మంచిది. చికెన్ మెడ, తోకతో పాటు, కోడి మొప్పలు తినడం కూడా ఆరోగ్యానికి మంచిది కాదు. కోడి మొప్పల్లో ఆహారం జీర్ణమయ్యే భాగాలు ఉంటాయి. ఈ భాగంలో క్రిములు, హానికరమైన బ్యాక్టీరియా ఎక్కువగా ఉంటాయి. ఈ క్రిములు మన శరీరానికి ప్రమాదం కలిగించే



అవకాశముంది. అందువల్ల కోడి మొప్పలను తినడం పూర్తిగా మానేయండి. కోడి ఊపిరితిత్తులు కూడా తినకూడని మరో భాగం. ఈ భాగంలో క్రిములు, వైరస్‌లు అధికంగా ఉంటాయి. ఇవి తింటే శరీరానికి తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కలగవచ్చు. కాబట్టి ఈ భాగాన్ని తినకూడదు. సాధారణంగా చికెన్ శరీరానికి పోషకాలను అందించగల అద్భుతమైన ఆహారం. కానీ ఏ భాగాలు తినాలి, ఏవి వద్దు అన్నదానిపై దృష్టి పెట్టి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అవసరం.

# తేనె వల్ల జుట్టు తెల్లబడుతుందా..?

**తొలిఅడుగు, ఆరోగ్యం :** జుట్టు రంగు మెలనిన్ పిగ్మెంట్ వల్ల వస్తుంది. ఇది జుట్టు వేర్లలోని మెలనోసైట్స్ ద్వారా ఉత్పత్తి అవుతుంది. తేనెలో గ్లూకోజ్ ఆక్సిడేజ్ అనే పదార్థం ఉంది. ఇది తక్కువ స్థాయిలో హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను ఉత్పత్తి చేస్తుంది. కానీ ఇది జుట్టు రంగు మార్చడానికి సరిపోదు. మనలో కొంతమంది తేనే తలపై పడితే జుట్టు తెల్లబడుతుందని నమ్ముతుంటారు. జుట్టు తెల్లబడటానికి గల అసలు కారణాలను, తేనెకు సంబంధించి ఉన్న తప్పుడు నమ్మకాలపై వైద్య నిపుణులు ఎం చెబుతున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. మన జుట్టు వేర్ల వద్ద ఉండే హేర్ ఫాలికల్స్ లో మెలనోసైట్స్ అనే కణాలు ఉంటాయి. ఈ మెలనోసైట్స్ మెలనిన్ పిగ్మెంట్‌ను ఉత్పత్తి చేస్తాయి. దీని వల్లే జుట్టుకు నల్లటి రంగు వస్తుంది. కొన్ని సందర్భాల్లో జన్యు మార్పులు లేదా వయసు ప్రభావం వల్ల మెలనిన్ ఉత్పత్తి తగ్గిపోతుంది. ఈ పరిస్థితిలో జుట్టు రంగు క్రమంగా తెల్లబడుతుంది. ఇది సహజమైన ప్రక్రియ కాగా.. తేనె వల్ల జుట్టు తెల్లబడడం అనేది శాస్త్రీయంగా అవాస్తవమని నిపుణులు తెలిపారు. తేనెలో గ్లూకోజ్ ఆక్సిడేజ్ అనే పదార్థం చాలా తక్కువ మోతాదులో ఉంటుంది. ఇది నీటితో లేదా తేమతో కలిసినప్పుడు హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను ఉత్పత్తి చేస్తుంది. హైడ్రోజన్ పెరాక్సైడ్ రంగు మార్చే లక్షణాలు కలిగి ఉన్నప్పటికీ, తేనెలో ఇది చాలా తక్కువ స్థాయిలో మాత్రమే ఉంటుంది. ముఖ్యంగా తేనె నుంచి వచ్చిన హైడ్రోజన్ పెరాక్సైడ్ జుట్టు రంగును మార్చలేని స్థాయిలో ఉండటం వల్ల, తేనె వల్ల జుట్టు తెల్లబడటం అనేది అసంభవమట. తేనే వల్ల జుట్టు తెల్లబడుతుందని చెప్పడం ఒక అపోహ మాత్రమే. తేనెను తలకు రాయడం వల్ల హానికరమైన ప్రభావాలు ఉండవు. తేనెలో ఉన్న పోషకాలు తల చర్మానికి మేలు చేస్తాయని మాత్రమే శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. అంతేకాకుండా తేనెను నేరుగా తలకు రాసినప్పటికీ.. ఇది జుట్టు రంగును మార్చే శక్తిని కలిగి ఉండదు. తేనెకు సంబంధించిన శాస్త్రీయ పరిశీలనల్లో కూడా ఇలాంటి ప్రభావాలపై



ఎలాంటి ఆధారాలు లేవని వైద్య నిపుణులు స్పష్టం చేశారు. తేనే వల్ల జుట్టు తెల్లబడుతుందని నమ్మి దీన్ని దూరంగా పెట్టడం సరైనది కాదు. తేనె ప్రకృతి సమృద్ధి కలిగిన అద్భుతమైన పదార్థం. ఇది ఆరోగ్యానికి, చర్మానికి ప్రయోజనకరమైన గుణాలు కలిగి ఉంది. రసాయన పదార్థాలు కలిగిన రంగులతో పోల్చితే తేనెలో ఉండే హైడ్రోజన్ పెరాక్సైడ్ చాలా తక్కువ మోతాదులో ఉంటుంది. కాబట్టి తేనెను ఉపయోగించడం వల్ల జుట్టు తెల్లబడుతుందని అనుకోవడం శాస్త్రీయంగా అవాస్తవం.

## జామ, ఉసిరి ఏది మేలు చేస్తుంది?

**తొలిఅడుగు, ఆరోగ్యం :** అన్ని కాలాల్లో ఆరోగ్యంగా ఉండాలంటే సీజనల్ పండ్లు, కూరగాయలు తప్పనిసరిగా తీసుకోవాలి. ముఖ్యంగా చలికాలంలో రోగాలు ఎక్కువగా దాడి చేస్తాయి. ఇలా జరగకుండా ఉండాలంటే ఈ కాలంలో వచ్చే పండ్లు ఆహారంలో తప్పని సరిగా తీసుకోవాలి. ముఖ్యంగా జామ, ఉసిరి వీటిని ఆహారంలో భాగంగా తీసుకుంటే ఎన్నో ఆరోగ్య సమస్యల నుంచి కాపాడుకోవచ్చు. చలికాలంలో కొన్ని రకాల ఆహారాలు తప్పనిసరిగా తినడం ఆరోగ్యానికి చాలా అవసరం. అటువంటి వాటిల్లో జామ, ఉసిరి ముందు వరుసలో ఉంటాయి. వీటిల్లో అనేక రకాల పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి రెండూ సూపర్ ఫుడ్స్. పురాతన కాలం నుంచి వివిధ ఆరోగ్య సమస్యలను నయం చేయడానికి వీటిని ఉపయోగిస్తున్నారు. అయితే వీటిలో ఒకటి ఎంచుకోవలసి వస్తే, ఏది ఆరోగ్యకరమైనది అనే సందేహం కలుగుతుంది. జామలో విటమిన్ సి, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, పొటాషియం పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఉసిరిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. అంతేకాకుండా ఉసిరిలో ఐరన్, కాల్షియం, టానిన్లు, ఫ్లేవనాయిడ్స్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీరాన్ని నిర్విషీకరణ చేయడానికి ఉపయోగపడతాయి. ఇవి రెండింటిలోనూ విటమిన్ సి కంటెంట్ అధికంగా ఉంటుంది. అయితే అధిక యాంటీఆక్సిడెంట్ స్థాయిల కారణంగా జామను ఎక్కువగా తీసుకోమని నిపుణులు చెబుతుంటారు. జామ, ఉసిరి..ఇవి రెండూ రోగనిరోధక శక్తిని పెంచుతాయి. జామలో విటమిన్ సి ఎక్కువగా ఉండటం వల్ల రోగనిరోధక శక్తి కూడా



ఎక్కువగా ఉంటుంది. ఇది కణాలను దెబ్బతినకుండా కాపాడుతుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. ఉసిరి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా సహజమైన నిర్విషీకరణగా కూడా పనిచేస్తుంది. ఇది టాక్సిన్స్‌ను బయటకు పంపడానికి సహాయపడుతుంది. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఉసిరిలోని యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఆర్థరైటిస్, డయాబెటిస్ వంటి దీర్ఘకాలిక సమస్యలను నియంత్రించడంలో సహాయపడతాయి. ఉసిరిలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది సాధారణ జలుబు లక్షణాల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మొత్తం రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. జామల ఫైబర్ అధికంగా ఉండే పండు. ఇది జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. గట్‌లో ఆరోగ్యకరమైన మైక్రోబయోటాను నిర్వహించడానికి ఇది చాలా మంచిది. ఉసిరి జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది ప్రేగు కదలికలను నియంత్రిస్తుంది. జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తికి సహాయపడుతుంది. ఉసిరిని అజీర్ణం, ఉబ్బరం చికిత్సకు ఆయుర్వేదంలో విస్తృతంగా ఉపయోగిస్తారు. జామలోని పీచు పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఉసిరి జీర్ణవ్యవస్థను నియంత్రిస్తుంది.

## గుండె ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలి..?

**తొలిఅడుగు, ఆరోగ్యం :** చలికాలంలో హార్ట్ ఎటాక్ రిస్క్ అధికంగా ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల రక్తనాళాలు కుదించుకొని రక్త సరఫరా సమస్యలు కలిగిస్తాయి. ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, అలసట వంటి లక్షణాలు హార్ట్ బ్లాకేజీకి సంకేతాలు. క్రమం తప్పకుండా హార్ట్ చెకప్ చేయించుకోవడం చాలా ముఖ్యం. చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గిపోవడం వల్ల గుండె సంబంధిత సమస్యలు పెరుగుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ రిపోర్ట్ ప్రకారం.. వీటిలో ప్రధానంగా హార్ట్ ఎటాక్ కేసులు అధికంగా నమోదవుతున్నాయట. చలికాలంలో శరీరం శీతల ఉష్ణోగ్రతలకు అలవాటు పడే ప్రక్రియలో, రక్తనాళాలు కుదించుకోవడం ప్రారంభిస్తాయి. ఈ పరిస్థితి రక్త సరఫరాను అడ్డుకుని హార్ట్ బ్లాకేజీకి దారి తీస్తుంది.హార్ట్ బ్లాకేజీ ముందే గుర్తించడానికి కొన్ని లక్షణాలు సహాయపడతాయి. ఛాతీ నొప్పి, ఛాతీపై ఒత్తిడి అనుభవించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటితో పాటు తేలికపాటి వ్యాయామం చేసినా శరీరం అలసిపోవడం, తలనొప్పి, మైకం వంటి సమస్యలు కూడా గమనించాల్సి ఉంటుంది. హార్ట్ బ్లాకేజీని నివారించడానికి జీవన విధానంలో కొన్ని



మార్పులు చేసుకోవాలి. రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం, పొగత్రాగడం, మద్యం తాగడం వంటి అలవాట్లకు దూరంగా ఉండడం ముఖ్యం. పౌష్టిక ఆహారం తీసుకోవడం, రోజువారీ జీవన విధానంలో ఆరోగ్యకరమైన అలవాట్లను కలపడం ద్వారా రిస్క్ తగ్గించవచ్చు. హార్ట్ బ్లాకేజీ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం చాలా ముఖ్యం. ఛాతీ నొప్పి సాధారణంగా గ్యాస్ సమస్య అని అనుకోకూడదు. నిర్లక్ష్యం చేస్తే హార్ట్ ఎటాక్ వచ్చే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఎలాంటి అనుమానాలు ఉన్నా వెంటనే పరీక్షలు చేయించుకోవాలి. నడక లేదా చిన్న పనులు చేసినప్పుడు ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది కలిగితే అది కూడా హార్ట్ బ్లాకేజీకి సంకేతమై ఉంటుంది. శరీరంలోని అలసటను తగ్గించడానికి సరైన జీవన విధానం అనుసరించడం చాలా అవసరం.

# బాలయ్య అఖండ 2.. ప్రగ్యతో పాటు ఇంకో హీరోయిన్ కూడా..



తొలిఅడుగు, సినిమా

బాలయ్య బాబు వరుస హిట్ సినిమాలతో ఫుల్ ఫామ్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఇటీవలే సంక్రాంతికి డాకు మహారాజ్ సినిమాతో వచ్చి వరుసగా నాలుగో హిట్ కొట్టాడు. నెక్ట్స్ అఖండ 2 షూటింగ్ లో జాయిన్ అవ్వబోతున్నారు. ప్రస్తుతం బాలయ్య లేని సీన్స్ తో అఖండ 2 షూటింగ్ జరుగుతుంది. ఇటీవలే కుంభమేళాలో అఖండ 2 షూటింగ్ జరిగింది. అఖండ సినిమాకు కొనసాగింపుగానే ఈ సినిమా ఉంటుంది. అయితే అఖండ సినిమాలో ఉన్న ప్రగ్య జైస్వాల్ అఖండ 2లో కూడా ఉన్నాను అని ఇటీవల డాకు మహారాజ్ ఈవెంట్స్ లో చెప్పింది. దీంతో అఖండ 2 సినిమాలో బాలయ్య సరసన ప్రగ్య కొనసాగింపు అలాగే ఉంటుందని అంతా ఫిక్స్ అయ్యారు. అయితే తాజాగా ఈ సినిమాలో మరో హీరోయిన్ ఉందని సమాచారం. తెలుగులో ఇటీవల వరుస హిట్ సినిమాలతో సెన్సేషన్ సృష్టించిన మలయాళీ భామ సంయుక్త మీనన్ అఖండ 2 సినిమాలో ఉన్నట్టు తెలుస్తుంది. మలయాళంలో పలు సినిమాలు చేసిన సంయుక్త తెలుగులో భీమ్లా నాయక్ సినిమాతో ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత బింబిసారా, సర్, విరూపాక్ష, డెవిల్.. ఇలా వరుసగా హిట్స్ కొట్టింది. ప్రస్తుతం స్వయంభు సినిమాలో నటిస్తుంది. తాజాగా అఖండ 2 సినిమాలో తీసుకున్నారు అని తెలుస్తుంది. దీంతో ఈ అమ్మడు మరింత బిజీ అయింది. ఇప్పటికే సంయుక్త మీనన్ చేతిలో స్వయంభు సినిమాతో పాటు బెల్లంకొండ శ్రీనివాస్ సినిమా, నారి నారి నడుమ మురారి సినిమాలు ఉండగా ఇప్పుడు అఖండ 2 చేరింది. ఈ సినిమాలు అన్ని కూడా హిట్ టాక్ తెచ్చుకునేలానే ఉన్నాయి. దీంతో సంయుక్త తెలుగులో స్టార్ అవ్వడం గ్యారెంటీ అంటున్నారు.




# హిట్ కొట్టిన విశాల్ సినిమా..

తొలిఅడుగు, సినిమా

సాధారణంగా సినిమాలు అప్పుడప్పుడు పలు కారణాలతో ఆలస్యం అవుతాయని తెలిసిందే. అలా హీరో విశాల్ మదగజరాజ సినిమా ఏకంగా 12 ఏళ్ళు ఆలస్యంగా రిలీజయింది. విశాల్, సంతానం, వరలక్ష్మి శరత్ కుమార్, అంజలి, సోనూసూద్ ముఖ్య పాత్రల్లో తెరకెక్కిన తమిళ్ సినిమా మదగజరాజ. జెమినీ ఫిలిం సర్క్యూట్ నిర్మాణంలో సుందర్ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. 2013 సంక్రాంతికి రిలీజ్ అవ్వాల్సిన సినిమా పలు కారణాలతో వాయిదా పడుతూ వచ్చి ఇటీవల 2025 సంక్రాంతికి జనవరి 12న తమిళ్ లో రిలీజయింది. ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్ గా తెరకెక్కిన మదగజరాజ సినిమా తమిళ్ ప్రేక్షకులను మెప్పించి 12 ఏళ్ళ తర్వాత వచ్చినా హిట్ కొట్టింది. తమిళ్ లో పెద్ద సినిమాలు ఏవి సంక్రాంతికి లేకపోవడంతో కలెక్షన్స్ కూడా బాగానే వచ్చాయని సమాచారం. దీంతో ఈ సినిమాని ఇప్పుడు తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. తెలుగులో కూడా మదగజరాజ అనే టైటిల్ తోనే జనవరి 31న రిలీజ్ చేస్తున్నారు.

# ఎస్ఎస్ఎంబి29 షూటింగ్ ప్రారంభం..



తొలిఅడుగు, సినిమా సూపర్ స్టార్ మహేశ్‌బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి కాంబినేషన్ లో తెరకెక్కబోతున్న ఎస్ఎస్ఎంబి మూవీ కోసం ఎంతగానో ఎదురు చూస్తున్న అభిమానులు గుడ్ న్యూస్. కొన్ని నెలలుగా ఈ మూవీ షూటింగ్ కోసం లోకేషన్స్ సెర్చ్ చేసిన రాజమౌళి ఫైనల్ గా షూటింగ్ ప్రారంభించినట్లు తెలుస్తోంది. తాగాజా ఈ స్టార్ డైరెక్టర్..ఈ మూవీకి సంబంధించిన ఓ ఫన్నీ వీడియోను అభిమానులతో పంచుకున్నారు. సింహాన్ని లాక్ చేసినట్లు పాస్ పోర్ట్ చూపిస్తున్న ఈ వీడియో సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. దీనికి మహేష్ బాబు.. ఒక్కసారి కమిట్ అయితే..నా మాట నేనే వినను అనే పోకిరి సినిమాలోని డైలాగ్ తో రిప్లే ఇచ్చారు. దీంతో వీరి కాంబోలో వస్తున్న సినిమా షూటింగ్ ప్రారంభించారని అభిమానులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. అలాగే, రాజమౌళి ట్వీట్ కు బాలీవుడ్ హీరోయిన్ ప్రియాంక చోప్రా కూడా స్పందించడంతో.. ఎస్ఎస్ఎంబి29లో ఈ బ్యూటీనే హీరోయిన్ అని ఫిక్స్ అవుతున్నారు. మేకర్స్ అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. కాగా, ఈ మూవీని యాక్షన్ అడ్వెంచర్ సినిమాగా పాన్ వరల్డ్ లెవల్ లో రూపొందిస్తున్నారు మేకర్స్. ఈ చిత్రం ఇండియాతోపాటు పలు విదేశీ భాషల్లోనూ విడుదల చేయనున్నట్లు సమాచారం.

# త్రిపుల్ బ్లాక్‌బస్టర్ అంటున్నారు

తొలిఅడుగు, సినిమా వెంకటేష్, అనిల్ రావిపూడి, శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ కాంబోలో రూపొందిన చిత్రం 'సంక్రాంతికి వస్తున్నాం'. దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించిన ఈ చిత్రం సంక్రాంతికి విడుదలై, విశేష ప్రేక్షకాదరణతో రికార్డ్ బ్రేకింగ్ హౌస్ ఫుల్ కలెక్షన్స్‌తో పొంగల్ బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకుంది. అంతేకాకుండా సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతున్న నేపథ్యంలో చిత్ర యూనిట్ బాక్సాఫీస్ సంభవం పేరుతో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వెంకటేష్ మాట్లాడుతూ, '''సంక్రాంతికి వస్తున్నాం' సక్సెస్ అనేది వండర్ ఫుల్ హ్యాపీ ఫీలింగ్. సంక్రాంతికి హానెస్ట్‌గా ఓ ఫ్యామిలీ సినిమా ఇవ్వాలని అనుకున్నాం. కానీ ఆడియన్స్ సినిమాని నెక్ట్స్ లెవల్‌కి తీసుకెళ్ళారు. చాలా సపోర్ట్, ఎంకరేజ్‌మెంట్ ఇచ్చారు. హిట్ కాదు.. ట్రిపుల్ బ్లాక్‌బ్లాక్ బస్టర్ అంటున్నారు. ఈ సినిమాకి ఇంత పెద్ద సక్సెస్ ఇచ్చిన ఆడియన్స్‌కి థ్యాంక్స్' అని అన్నారు. 'మా సినిమాని ఇంతమంది చూసి అప్రిషియేట్ చేయడం, రెవెన్యూ సైడ్ కూడా మేము ఊహించనిదాని కంటే అద్భుతంగా రావడం చాలా ఆనందంగా ఉంది. వచ్చిన ప్రతి రూపాయి ప్రేక్షకుడి నవ్వుతో రావడం చాలా హ్యాపీగా ఉంది. ఈ సక్సెస్ ఎప్పటికీ గుర్తుండిపోతుంది. ఫ్యామిలీ సినిమాలకి ఉన్న స్ట్రెంత్‌ని ఈ సినిమా మరోసారి నిరూపించింది' అని దర్శకుడు అనిల్ రావిపూడి చెప్పారు. సంగీత దర్శకుడు భీమ్స్ మాట్లాడుతూ, 'దర్శకుడు అనిల్ ఓ లైబ్రెరీ. ఆయన దగ్గర చాలా విషయాలు నేర్చుకున్నాను. చాలా చిన్న, చిన్న పదాలని ఎంత అందంగా పట్టుకోవచ్చో తెలుసుకున్నాను. ఈ సినిమా నాకు ఓ అమ్మలాంటి జ్ఞాపకం. ఈ సినిమాతో ప్రతి గడపకు వెళ్ళగలిగాను. ప్రేక్షకుల ప్రేమకు ధన్యవాదాలు' అని తెలిపారు.



# రెండేళ్లుగా రాసే పద్ధతి పాటిస్తున్నాం

తొలిఅడుగు, సినిమా 'రైటింగ్ అనేది మీకు సహజంగా వస్తే ఈ రోజు మీరు కృతజ్ఞతతో ఉన్న మూడు విషయాలను రాయండి. అవి పెద్దగా ఉండాల్సిన అవసరం లేదు. కేవలం నిజాయితీగా ఉండాలి. కానీ రాయడం కష్టంగా, బలవంతంగా అనిపిస్తే మీరు బాగా విశ్వసించే వారితో షేర్ చేయండి. అంతేకాదు ఏమీ చేయక పోయినా కొన్నిసార్లు సైలెంట్‌గా కూర్చున్నా చాలు. ఈ చిన్న అభ్యాసం మొదట చాలా సింపుల్‌గా అనిపించొచ్చు. కానీ ప్రతిదీ మీరు చూసే విధానాన్ని మార్చే శక్తిని కల్గివుంటుంది. ఒకసారి ప్రయత్నించండి. ఇది నాకు గేమ్‌ఛేంజర్‌గా మారింది' అని కథానాయిక సమంత అన్నారు. సిటాడెల్ హన్నీ బన్నీ వెబ్‌సిరీస్‌లో ఆమె నటించారు. ఇందులో వరుణ్‌ధావన్‌తో కలిసి మెప్పించారు. ప్రస్తుతం పెద్దగా సినిమాల్లో కనిపించకపోయినా సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతూ తన పర్యటనల సమాచారాన్ని తెలియజేస్తున్నారు. తాజాగా ఆమె చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గత రెండేళ్లుగా తాను పాటిస్తున్న పద్ధతి గురించి అందులో పై విధంగా తెలియజేశారు.

